# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు

12 YEARS PEN POWER JOURNEY 2014 - 2026 ప్రశ్నించడం మన హక్కు

విశాఖపట్నం | హైదరాబాద్ | ఉభయ గోదావరి | ఎన్. టీ. ఆర్ | గుంటూరు | ప్రకాశం | నెల్లూరు | తిరుపతి | చిత్తూరు | కడప

సంపుటి : 2 సంచిక : 17 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : బాపట్ల మంగళవారం 22 సెప్టెంబర్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME :2 ISSUE : 17 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : BAPATLA TUE 22 SEPTEMBER 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Bapatla,Ongole,Visakhapatnam,Kakinada,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur




## 2028 నాటికి కార్బన్ న్యూట్రల్‌గా కుప్పం

- కుప్పంలో వివిధ పథకాల లబ్ధిదారులతో సీఎం చంద్రబాబు ముఖాముఖి
- సూపర్ సిక్స్, సంజీవని పథకాల అమలు తీరుపై ఆరా
- త్వరలో రాష్ట్రవ్యాప్తంగా సంజీవని కార్యక్రమం విస్తరణకు ప్రణాళిక
- వ్యవసాయం, పర్యాటకం, మౌలిక వసతులపై అధికారులకు కీలక ఆదేశాలు

పెన్ పవర్ డెస్క్:ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తన సొంత నియోజకవర్గం కుప్పంలో విస్తృతంగా పర్యటించి, పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై సమీక్ష జరిపారు. ప్రభుత్వ పథకాల లబ్ధిదారులతో నేరుగా మాట్లాడి, క్షేత్రస్థాయిలో వాటి అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ పర్యటనలో భాగంగా సూపర్ సిక్స్ పథకాలు

- మిగతా 2లో





## టీచర్లపై దాడి నిందితులను వదిలిపెట్టం..


### మంత్రి లోకేశ్ మాస్ వార్నింగ్

- స్పోర్ట్స్ కోటా టీచర్లపై దాడికి దిగారంటూ లోకేశ్ ఆగ్రహం
- దైవం వంటి గురువులపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలుంటాయని హెచ్చరిక
- దేశానికి వన్నె తెచ్చిన క్రీడాకారులను జగన్ అవమానిస్తున్నారని ఆరోపణ
- రౌడీ షీటర్లు, గంజాయి, బ్లేడ్ బ్యాచ్‌లను టీచర్లపైకి ఉసిగొల్పారని విమర్శ
- ప్రభుత్వ పాఠశాలలు, టీచర్ల జోలికి రావొద్దని హితవు

- మిగతా 2లో

## శబరిమలలో ప్రసాదం కొరత..

### హైకోర్టుకు వెళ్తానన్న మంత్రి



పెన్ పవర్ డెస్క్: సుప్రసిద్ధ శబరిమల అయ్యప్ప ఆలయంలో ప్రసాదం కొరతపై కేరళం ప్రభుత్వం, ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డు మధ్య వివాదం ముదిరింది. భక్తులకు సరిపడా

- మిగతా 2లో



## విజయవాడలో 'శాప్' వద్ద ఉద్రిక్తత..

# టీచర్లు వర్సెస్ వైసీపీ..

### తోకలు కత్తిరిస్తానంటూ చంద్రబాబు ఫైర్

- విజయవాడ శాప్ కార్యాలయం వద్ద స్పోర్ట్స్ కోటా టీచర్లపై వైసీపీ నేతల దాడి యత్నం
- తమ నియామకాలు పారదర్శకమని చెప్పేందుకు వచ్చిన టీచర్లు.. అక్రమాలంటూ వైసీపీ నిరసన
- ఘటనపై సీఎం చంద్రబాబు తీవ్ర ఆగ్రహం, రౌడీయిజం చేస్తే తోకలు కత్తిరిస్తామని హెచ్చరిక
- గురువులపై దాడులను సహించబోమని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టీకరణ
- ప్రతిపక్షానికి దమ్ముంటే ఆధారాలతో అసెంబ్లీకి రావాలని సవాల్ విసిరిన ముఖ్యమంత్రి

పెన్ పవర్ డెస్క్:విజయవాడలోని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (శాప్) కార్యాలయం వద్ద మెగా డీఎస్సీ స్పోర్ట్స్ కోటాలో ఎంపికైన ఉపాధ్యాయులపై వైసీపీ నేతలు దాడికి యత్నించారన్న ఆరోపణలపై సీఎం చంద్రబాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కుప్పం పర్యటనలో ఉన్న ఆయన ఈ ఘటనపై తీవ్రంగా స్పందించారు. రాష్ట్రంలో రౌడీయిజం, అరాచకాలను ఏమాత్రం ఉపేక్షించేది లేదని, అలాంటి చర్యలకు పాల్పడేవారి తోకలు కత్తిరిస్తామని హెచ్చరించారు. గురువులపై దాడులకు దిగడాన్ని ప్రభుత్వం ఎట్టిపరిస్థితుల్లోనూ సహించబోదని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుని తీరుతామని స్పష్టం చేశారు.

**శాప్ కార్యాలయం వద్ద ఏం జరిగింది?**

మెగా డీఎస్సీ స్పోర్ట్స్ కోటా నియామకాల్లో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ వైసీపీ నేతలు కొద్ది రోజులుగా విమర్శలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో, తమ నియామకాలు అత్యంత పారదర్శకంగా జరిగాయని, తమ సర్టిఫికెట్లు, సాధించిన పతకాలు అన్నీ నిజమైనవని స్పష్టం చేసేందుకు స్పోర్ట్స్ కోటాలో ఎంపికైన ఉపాధ్యాయులు సోమవారం విజయవాడలోని శాప్ కార్యాలయానికి చేరుకున్నారు. క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, శాప్ ఛైర్మన్, ఎండీలను కలిసి తమ

- మిగతా 2లో



## స్టాలిన్ ఓటమి నన్ను షాక్‌కు గురిచేసింది

- విజయ్ పాలనపై అప్పుడే మాట్లాడటం సరికాదన్న ప్రకాశ్ రాజ్
- బీజేపీ పతనానికి సమయం ఆసన్నమయిందని వ్యాఖ్య
- తనకు కూడా మోదీనే ప్రధానమంత్రి అన్న ప్రకాశ్ రాజ్

- మిగతా 2లో

## ఏపీలో జూడాలకు గుడ్ న్యూస్ చెప్పిన కూటమి ప్రభుత్వం

- ఏపీలో జూనియర్ డాక్టర్లు, హౌస్ సర్జన్ల స్టైఫండ్ పెంపు
- ఎంబీబీఎస్, బీడీఎస్ ఇంటర్న్‌లకు 10 శాతం పెరుగుదల
- పీజీ విద్యార్థులకు 5%, సూపర్ స్పెషాలిటీ వారికి 3.5% పెంపు
- ప్రభుత్వంపై ఏటా రూ.34.08 కోట్ల అదనపు ఆర్థిక భారం
- 2026 జనవరి 1 నుంచే పెంపు వర్తిస్తుందని ఉత్తర్వుల్లో వెల్లడి

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్‌లోని ప్రభుత్వ వైద్య కళాశాలల్లో పనిచేస్తున్న జూనియర్ డాక్టర్లు, హౌస్ సర్జన్లకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. వారి స్టైఫండ్‌ను పెంచుతూ సోమవారం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది.

- మిగతా 2లో

## బంగాళాఖాతంలో వాయుగుండం..

# ఏపీలో 4 రోజులు భారీ వర్షాలు

- బంగాళాఖాతంలో అల్పపీడనం, వాయుగుండంగా బలపడే అవకాశం
- రాబోయే నాలుగు రోజులు రాష్ట్రంలో భారీ నుంచి అతి భారీ వర్షాలు
- పలు కోస్తాంధ్ర జిల్లాలకు విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరిక
- మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లవద్దని సూచన
- లోతట్టు ప్రాంత ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశం




పెన్ పవర్ డెస్క్:బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లో రాబోయే నాలుగు రోజుల పాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ (ఏపీఎస్డీఎంఏ) వెల్లడించింది. ప్రస్తుతం కేంద్రీకృతమై ఉన్న

- మిగతా 2లో



## చైనాకు భారత ఎగుమతులు జోరు..

### 40 శాతం వృద్ధి!

- చైనాకు భారీగా పెరిగిన భారత ఎగుమతులు
- గత ఐదు నెలల్లో దాదాపు 40 శాతం వృద్ధి నమోదు
- ఎలక్ట్రానిక్స్ వస్తువుల ఎగుమతుల్లో గణనీయమైన పెరుగుదల
- ఏఐ, డేటా సెంటర్ల వల్లే డిమాండ్ పెరిగిందంటున్న నిపుణులు
- అయినప్పటికీ వాణిజ్య లోటులో పెద్దగా మార్పు లేని వైనం

పెన్ పవర్ డెస్క్:భారత్ నుంచి చైనాకు ఎగుమతులు అనూహ్యంగా వృద్ధి చెందుతున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి ఐదు నెలల్లో (ఏప్రిల్-ఆగస్టు) చైనాకు భారత ఎగుమ తులు సుమారు

- మిగతా 2లో

## కేసీఆర్ ఫామ్‌హౌస్ చుట్టూ కొనసాగుతున్న భూసర్వే..

### రంగంలోకి రెవెన్యూ అధికారులు

- ఎర్రవల్లిలో భూములపై కొనసాగుతున్న రెవెన్యూ సర్వే
- సర్వే నంబర్ 325పై అధికారుల ప్రత్యేక దృష్టి
- మొత్తం 388 ఎకరాల భూముల పరిశీలన
- శాటిలైట్ మ్యాపింగ్‌తో భూముల హద్దుల పరిశీలన
- ఆక్రమణలని తేలితే భూముల స్వాధీనానికి చర్యలు

- మిగతా 2లో



## మైసమ్మ అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించిన పవన్ కల్యాణ్



- పిఠాపురం నియోజకవర్గంలో పవన్ కల్యాణ్ పర్యటన
- ఫక్రుద్దీన్ పాలెంలో సుందరీకరించిన చెరువు ప్రారంభం
- పిఠాపురంలో రూ. 6 కోట్లతో 11 చెరువుల ఆధునీకరణ
- గ్రామాల్లో చెరువులను ఆహ్లాద, ఆరోగ్య కేంద్రాలుగా మార్చే ప్రణాళిక
- రాష్ట్రవ్యాప్తంగా రూ. 50 కోట్లతో 105 చెరువుల అభివృద్ధి

- మిగతా 2లో

## అఫ్గానిస్థాన్‌పై పాక్ వైమానిక దాడులు..

# 28 మంది మృతి..!



పెన్ పవర్ డెస్క్:అఫ్గానిస్థాన్‌పై సోమవారం పాకిస్థాన్ వైమానిక దాడులకు పాల్పడింది. ఈ దాడుల్లో 28 మంది ఉగ్రవాదులు మరణించినట్లు పాక్ ప్రకటించగా.. ముగ్గురు పౌరులు ప్రాణాలు కోల్పోయారని అఫ్గాన్ వెల్లడించింది. గత కొన్ని నెలలుగా

- మిగతా 2లో

## ఎడిటర్ వ్యూ

# డాక్టరమ్మ ఆపరేషన్ సక్సెస్ చేస్తుందా? భీమిలీ నుంచి గట్టెక్కుతారా?

భీమిలి నియోజకవర్గ సమన్వయకర్తగా బొత్స అనూష ను నియమిస్తూ జగన్ నిర్ణయం తీసుకున్నారు. పార్టీ అధినేత వైఎస్ జగన్ ఆదేశాల మేరకు నియామకంజరిగినట్లు వైసీపీ నుంచి అధికారిక ప్రకటన తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయం విడుదల చేసింది. భీమిలీ నియోజకవర్గ ఇన్ ఛార్జిగా... చిన్న శ్రీను పార్టీని వీడటంతో ఆయన స్థానంలో బొత్స అనూషను నియమించాలని జగన్ నిర్ణయించారు. మొన్న బొత్సతో సమావేశమై వన్ టూ వన్ చర్చించిన తర్వాత జగన్ ఈ నిర్ణయం తీసుకున్నారు. భీమిలీ నియోజకవర్గం వైసీపీ ఇన్ ఛార్జిగా బొత్స అనూష వ్యవహరించనున్నారు. అయితే బొత్స అనూష ఎంపిక భీమిలి నియోజకవర్గంలో సరైన ఎంపికేనా? అన్న చర్చ జరుగుతుంది. అక్కడ బలమైన టీడీపీ నేత గంటా శ్రీనివాసరావు ఉన్నారు. అలాంటి చోట రాజకీయ అరంగ్రేట్రం చేస్తున్న బొత్స అనూష ఏ మేరకు విజయం సాధిస్తారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సొంత పార్టీలోనే ఈ రకమైన అభిప్రాయం వ్యక్తమవుతుంది.

**బొత్స వారసురాలిగా...**

బొత్స అనూష కాపు సామాజికవర్గం నేత కావచ్చు. బొత్స రాజకీయ వారసురాలిగా ఆమె రాజకీయ ఓనమాలు భీమిలి నుంచి నేర్చుకోవాల్సి ఉంది. తొలుత విజయనగరం జడ్పీ ఛైర్మన్ గా బొత్స అనూషను ఎంపిక చేయాలని నిర్ణయించారు. అయితే చిన్న శ్రీను పార్టీ మారిన తర్వాత జరిగిన పరిణామాల నేపథ్యంలో బొత్స అనూషకు భీమిలీ బాధ్యతలను అప్పగించడం సబబేనా? అన్న ప్రశ్న అందరిలోనూ కలుగుతుంది. తొలుత గుడివాడ అమర్నాధ్, మాజీ మంత్రి అవంతి శ్రీనివాసరావు వంటి పేర్లను పరిశీలించినప్పటికీ వారికంటే కొత్త వారినే ఎంపిక చేయడం మంచిదని జగన్ భావించారు. అయితే భీమిలీలో కాపు సామాజికవర్గం ఓటర్లు ఎక్కువ. జనసేన, టీడీపీ కలసి ఉంటే అక్కడ నెగ్గుకు రావడం కష్టమే. ఈ పెను సవాల్ నుంచి ఈ డాక్టర్ బొత్స అనూష ఎలా బయటపడతారన్నది సందేహంగా మారింది.

**మజ్జి శ్రీనివాసరావు నిష్క్రమణతో ...**

ఇప్పటివరకు భీమిలి ఇన్ ఛార్జ్ గా ఉన్న మజ్జి శ్రీనివాసరావు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. ఆ స్థానాన్ని భర్తీ చేస్తూ పార్టీ శ్రేణులు చెల్లాచెదురు కాకుండా చూడటానికి జగన్ ఈ నిర్ణయం తీసుకున్నారు. ఉత్తరాంధ్రలో బొత్స కుటుంబానికి పట్టుంది. ఆయనకు వ్యక్తిగతంగా బలముంది. మరొకవైపు సీనియర్ నేత కావడం, కాపు సామాజికవర్గం కావడంతో ఆర్థికంగా, సామాజికవర్గం పరంగా బలంగా కనిపిస్తుంది. విజయనగరం, విశాఖపట్నం జిల్లాల రాజకీయాల్లో మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ కుటుంబానికి గట్టి పట్టుంది. బొత్స కుటుంబానికి చెందిన వ్యక్తిని ఇక్కడ పెట్టడం వల్ల స్థానిక క్యాడర్ కూడా కదలకుండా పార్టీ వైపే ఉంటుందని అధిష్టానం భావించింది. డాక్టర్ బొత్స అనూష వైద్య విద్యను అభ్యసించి, ఇటీవలే రాజకీయాల్లో యాక్టివ్ అవుతున్నారు. మహిళా, యువ కోటాలో ఆమెను రంగంలోకి దించడం ద్వారా ప్రతిపక్ష నేత గంటా శ్రీనివాసరావును ఢీకొట్టేందుకు వైసీపీ ఒక కొత్త అస్త్రాన్ని ప్రయోగించినట్లయింది. వాస్తవానికి బొత్స అనూష విజయనగరం జిల్లా పరిషత్ పీఠంపై ఆసక్తి చూపించగా, ఆమెను భీమిలికి పంపడంపై భిన్నమైన విశ్లేషణలు వస్తున్నాయి. అయినప్పటికీ, నియామకం జరిగిన వెంటనే బొత్స అనూష తన తండ్రి బొత్స సత్యనారాయణతో కలిసి స్థానిక క్యాడర్ ను కలుపుకుంటూ భీమిలిలో పార్టీ బలోపేతానికి పూర్తి స్థాయిలో రంగంలోకి దిగారు. మరి ఈ డాక్టర్ భీమిలిలో వైసీపీని ఎలా ఆపరేషన్ చేస్తారన్నది చూడాలి.

## శబరిమలలో ప్రసాదం కొరత..

- మొదటి పేజి తరువాయి

ప్రసాదం లేకపోవడంపై కేరళం మంత్రి మురళీధరన్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. నిర్వహణ లోపం వల్లే ఇలాంటి పరిస్థితి తలెత్తిందని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ అవసరమైతే హైకోర్టుకు వెళ్తానని అన్నారు. ప్రసాదం కొరత ఏర్పడటంతో ఆదివారం పంపిణీని పరిమితం చేసిన సంగతి తెలిసిందే. ప్రతి యాత్రికుడు ఒక అరవణ పాయసం, మూడు అప్పం ప్యాకెట్లను మాత్రమే కొనుగోలు చేసేందుకు అనుమతిచ్చారు. ప్రసాదం కౌంటర్లను మధ్యాహ్నం 1.30కే మూసేశారు. తిరిగి 5 గంటలకు మళ్లీ తెరిచారు. దీంతో భక్తుల నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి. ఈ తరహా పరిస్థితులు భవిష్యత్‌లో పునరావృతం కాకుండా ఉండాలంటే.. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరముందని మంత్రి మురళీధరన్ అన్నారు. ముఖ్యమంత్రి వి.డి. సతీశన్‌తోనూ మాట్లాడి.. విచారణకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని కోరనున్నట్లు చెప్పారు. అయితే, కన్ని నెలలో స్వామిని దర్శించుకునే భక్తుల కోసం దాదాపు 2.6 లక్షల డబ్బాల ప్రసాదాన్ని ముందే సిద్ధం చేసినట్లు దేవస్థానం అధికారులు చెబుతున్నారు. గతేడాది కంటే 50 వేల డబ్బాలు అధికంగానే తయారు చేశామని, సీజను ప్రారంభం కాకముందే భక్తుల సంఖ్య పెరిగిపోవడంతోనే ఈ సమస్య తలెత్తిందని తెలిపారు. సోమవారం నాటికి కేవలం 14 వేల డబ్బాలు మాత్రమే మిగిలి ఉన్నట్లు చెప్పారు. ప్రసాదం తయారీ కేంద్రాన్ని ఆధునీకరిస్తున్నందువల్లే కొరత ఏర్పడిందని ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డు చెబుతుండటంపై మంత్రి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా పనులు ఎలా చేపడతారని ఆగ్రహం వ్యక్తం చేశారు. శబరిమల యాత్ర నేపథ్యంలో.. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకూడదన్న ఉద్దేశంతో ముందస్తుగా ప్రసాదం తయారీ కేంద్రాన్ని ఆధునీకరిస్తున్నట్లు దేవస్థానం బోర్డు తెలిపింది.

## కేసీఆర్ ఫామ్‌హౌస్ చుట్టూ కొనసాగుతున్న భూసర్వే.. రంగంలోకి రెవెన్యూ అధికారులు

సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం ఎర్రవల్లి గ్రామంలో మాజీ సీఎం కేసీఆర్ ఫామ్‌హౌస్ పరిసర భూములపై రెవెన్యూ అధికారులు సర్వే కొనసాగిస్తున్నారు. ఎర్రవల్లితో పాటు వెంకటాపూర్, వరదరాజుపూర్ సరిహద్దుల్లో ఉన్న భూములను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ఆదివారం సెలవు కావడంతో నిలిచిన సర్వే.. సోమవారం ఉదయం తిరిగి ప్రారంభమైంది. సర్వే నంబర్ 325 పరిధిలో ఉన్న ప్రభుత్వ, అసైన్డ్ భూములపై అధికారులు ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. మొత్తం 388 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ భూముల్లో ప్రభుత్వ భూమి ఎంత? అసైన్డ్ భూమి ఎంత? ప్రస్తుతం ఎవరి అధీనంలో ఉంది? ప్రైవేటు పట్టా భూములు ఎంతమేర ఉన్నాయి? అనే వివరాలను సేకరిస్తున్నారు. అసిస్టెంట్ డైరెక్టర్ సుదర్శన్ రాథోడ్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ సేవ్యానాయక్, గజ్వేల్ ఆర్డీవో చంద్రకళ, స్థానిక తహసీల్దార్లతో కూడిన ప్రత్యేక బృందాలు సర్వేలో పాల్గొంటున్నాయి. శాటిలైట్ మ్యాపింగ్, ఆధునిక సాంకేతికతతో పాటు పాత రెవెన్యూ రికార్డులను పరిశీలిస్తూ భూముల హద్దులను నిర్ధారిస్తున్నారు. సర్వే నంబర్ 325 పరిధిలో భూములు ఉన్న 100 మందికి పైగా రైతులకు ఇప్పటికే అధికారులు నోటీసులు ఇచ్చారు. పట్టాదార్ పాస్‌పుస్తకాలు, ఇతర యాజమాన్య పత్రాలతో సర్వే ప్రాంతానికి రావాలని సూచించారు. ఫామ్‌హౌస్ పరిసర భూముల కేటాయింపులు, ధరణి రికార్డుల్లో అక్రమాలపై ఇటీవల అసెంబ్లీలో చర్చ జరిగిన నేపథ్యంలో ఈ విచారణ చేపట్టినట్లు అధికారులు తెలిపారు. సర్వే పూర్తయ్యాక సమగ్ర నివేదికను ఉన్నతాధికారులకు, ప్రభుత్వానికి అందజేయనున్నారు. ప్రభుత్వ లేదా అసైన్డ్ భూములు ఆక్రమణకు గురైనట్లు తేలితే.. నిబంధనల ప్రకారం స్వాధీనం చేసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు.

# 2028 నాటికి కార్బన్ న్యూట్రల్‌గా కుప్పం

- మొదటి పేజి తరువాయి

అందుకుంటున్న లబ్ధిదారులతో ఆయన ముఖాముఖి నిర్వహించారు. తల్లికి వందనం, స్త్రీశక్తి, అన్నదాత సుఖీభవ, ఎన్టీఆర్ భరోసా వంటి పథకాల ద్వారా అందుతున్న ప్రయోజనాలు, వాటితో కుటుంబంలో వచ్చిన ఆర్థిక మార్పుల గురించి లబ్ధిదారులను సీఎం అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా, కుప్పంలోని యువ పారిశ్రామికవేత్తలతో సమావేశమై వారికి ప్రభుత్వ ప్రోత్సాహంపై భరోసా ఇచ్చారు. పైలట్ ప్రాజెక్టుగా అమలవుతున్న సంజీవని సేవల లబ్ధిదారులతో మాట్లాడి, పథకం పనితీరుపై ఆరా తీశారు. త్వరలోనే ఈ కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, "ప్రతి పేద కుటుంబానికి అండగా నిలవాలనే లక్ష్యంతో, ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నాం. పేదల జీవితాల్లో వెలుగులు నింపడమే మా ప్రభుత్వ ధ్యేయం" అని స్పష్టం చేశారు.

**అభివృద్ధి పనులపై సమీక్ష, అధికారులకు ఆదేశాలు**

కుప్పంలో జరుగుతున్న మౌలిక వసతుల కల్పనపై స్థానికులతో సీఎం చర్చించారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన, సీసీ రోడ్లు, తాగునీటి సరఫరా వంటి అంశాలపై ఫీడ్‌బ్యాక్ తీసుకున్నారు. జల్ జీవన్ మిషన్ పనుల కోసం కొత్త రోడ్లు వేయడానికి ముందే పైప్‌లైన్లు వేయాలని, రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటి స్ట్రీట్ లైటింగ్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.

**కుప్పం దేశానికే ఆదర్శం**

"2028 నాటికి కుప్పం నియోజకవర్గాన్ని కార్బన్ న్యూట్రల్‌గా మార్చడమే లక్ష్యం. ఈ ఏడాది డిసెంబరు నాటికి ప్రతి ఇంటిపై సోలార్ ప్యానెళ్లు ఏర్పాటు చేయాలి. వ్యర్థాలను సంపదగా మార్చి, పచ్చదనాన్ని 80 శాతానికి పెంచి కుప్పాన్ని దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దాలి" అని చంద్రబాబు పిలుపునిచ్చారు. వ్యవసాయ వ్యయం తగ్గించి, రైతుల ఆదాయం పెంచేందుకు ప్రణాళికలు రచిస్తామని, పర్యాటకంగాను కుప్పాన్ని అభివృద్ధి చేస్తామని తెలిపారు. జీరో పావర్టీ కార్యక్రమంలో భాగంగా 2026 డిసెంబరు నాటికి నియోజకవర్గంలోని 8,904 'బంగారు కుటుంబాలను' ఆర్థికంగా ఆదుకుంటామని ఆయన భరోసా ఇచ్చారు.

## విజయవాడలో 'శాప్' వద్ద ఉద్రిక్తత..
# టీచర్లు వర్సెస్ వైసీపీ..

- మొదటి పేజి తరువాయి

గోడు వెళ్లబుచ్చుకోవాలని, వినతిపత్రం సమర్పించాలని వారు భావించారు. అయితే, అదే సమయంలో వైసీపీ నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో శాప్ కార్యాలయం వద్దకు చేరుకుని నిరసనకు దిగారు. డీఎస్సీ నియామకాల్లో అక్రమాలు జరిగాయంటూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. దీంతో అక్కడే ఉన్న ఉపాధ్యాయులు కూడా తమకు న్యాయం చేయాలని, తమపై నిరాధార ఆరోపణలు మానుకోవాలని ప్రతి నినాదాలు ప్రారంభించారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. పోటాపోటీ నినాదాలతో ఆ ప్రాంతంలో వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు రంగప్రవేశం చేయాల్సి వచ్చింది.

**వైసీపీపై నిప్పులు చెరిగిన సీఎం చంద్రబాబు**

వైసీపీ రోజురోజుకూ మరింత దూకుడుగా, అరాచకంగా వ్యవహరిస్తోందని చంద్రబాబు మండిపడ్డారు. "విజయవాడలో గురువుల మీద రౌడీలు దాడులు చేస్తున్నారు. దీన్ని చూస్తూ ప్రభుత్వం నిశ్శబ్దంగా ఉండదు. ఇలాంటి చర్యలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం" అని ఆయన అన్నారు. విజయవాడలో సాక్షి రిపోర్టర్ ప్రమేయంతో ఒక ఉపాధ్యాయుడిపై జరిగిందని, వైసీపీ తీరు అత్యంత దారుణంగా ఉందని విమర్శించారు. సమస్యలుంటే చట్టపరంగా న్యాయస్థానాలను ఆశ్రయించవచ్చని, అంతేకానీ భౌతిక దాడులకు పాల్పడటం, ఉపాధ్యాయులపై రౌడీలను ఉసిగొల్పడం ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదని హితవు పలికారు. గత ప్రభుత్వంలోనూ ఇదే విధంగా రౌడీయిజం, అరాచకాలతో పాలన సాగిందని, కుప్పంలో తనను సైతం అడ్డుకునే ప్రయత్నం చేశారని గుర్తుచేశారు. స్పోర్ట్స్ కోటా నియామకాలపై ప్రతిపక్షానికి దమ్ముంటే ఆధారాలతో అసెంబ్లీకి రావాలని, అక్కడ తమ వద్ద ఉన్న ఆధారాలతో వారి నోరు మూయిస్తామని సవాల్ విసిరారు. క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి సైతం ఈ ఘటనను తీవ్రంగా ఖండించారు. ఈ పరిణామాలతో రాష్ట్ర రాజకీయాలు మరింత వేడెక్కాయి.

# టీచర్లపై దాడి నిందితులను వదిలిపెట్టం..

విజయవాడలో స్పోర్ట్స్ కోటా డీఎస్సీ-2025 టీచర్లపై దాడికి వైసీపీ ముఠాలు దాడికి దిగాయంటూ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. వైసీపీపై తీవ్ర ఆరోపణలు చేస్తూ 'ఎక్స్'లో పోస్టు చేశారు. క్రీడాకారులుగా దేశానికి పేరు తీసుకొచ్చిన వారికి అన్యాయం చేయడం సరికాదని అన్నారు. దైవంలా భావించే టీచర్లపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

స్పోర్ట్స్ కోటాలో అవకతవకలు జరిగాయంటూ ఫేక్ ఆరోపణలు చేసినప్పుడే జగన్ దుర్బుద్ధి బయటపడిందని లోకేశ్ విమర్శించారు. క్రీడల్లో ప్రతిభ చూపించి టీచర్ ఉద్యోగాలు సాధించిన వారిని వైసీపీ అవమానిస్తోందని ఆరోపించారు. తమకు న్యాయం చేయాలంటూ స్పోర్ట్స్ కోటా డీఎస్సీ-2025 టీచర్లు విజయవాడ శాప్ కార్యాలయం వద్ద అధికారులను కలిశారని లోకేశ్ తెలిపారు. ఈ సమయంలో వైసీపీకి చెందిన కొందరు వ్యక్తులు టీచర్లపై దాడికి దిగారని ఆరోపించారు. రౌడీ షీటర్లు, గంజాయి, బ్లేడ్ బ్యాచ్‌లను టీచర్లపైకి ఉసిగొల్పారని లోకేశ్ ఆరోపించారు. గురువులపై రాడ్లు, కర్రలతో దాడి చేయడం దారుణమని అన్నారు.

టీచర్లపై దాడి చేసిన వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని లోకేశ్ స్పష్టం చేశారు. వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు, టీచర్ల జోలికి వైసీపీ రావడం మానుకోవాలని సూచించారు.

## మైసమ్మ అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించిన పవన్ కళ్యాణ్

ఉప ముఖ్యమంత్రి, పిఠాపురం ఎమ్మెల్యే పవన్ కళ్యాణ్ సోమవారం సొంత నియోజకవర్గంలో పర్యటించారు. ఫకృద్దీన్ పాలెం గ్రామంలోని మైసమ్మ చెరువు గట్టుపై వెలసిన మైసమ్మ అమ్మవారిని దర్శించుకుని, పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం, గ్రామీణ చెరువులకు సరికొత్త రూపునిచ్చే బృహత్తర కార్యక్రమంలో భాగంగా రూ. 73 లక్షల వ్యయంతో సుందరీకరించిన మైసమ్మ చెరువును ప్రజలకు అంకితం చేశారు. గ్రామాల్లోని చెరువులను కేవలం నీటి వనరులుగా కాకుండా, ప్రజలందరికీ ఆహ్లాదాన్ని, ఆరోగ్యాన్ని పంచే సామాజిక కేంద్రాలుగా తీర్చిదిద్దాలన్నది ప్రభుత్వ లక్ష్యమని ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ తెలిపారు. ఫకృద్దీన్ పాలెంలోని మైసమ్మ చెరువును రాష్ట్రానికే ఒక మోడల్‌గా అభివృద్ధి చేసినట్లు వివరించారు. చెరువు చుట్టూ ఏర్పాటు చేసిన వాకింగ్ ట్రాక్, ఓపెన్ ఎయిర్ జిమ్, పిల్లల పార్కును ఆయన ప్రారంభించారు. చెరువు గట్టుపై కలియదిరుగుతూ, అక్కడి వృక్షాల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. చెరువు మధ్యలో నూతనంగా నిర్మిస్తున్న నందీశ్వరుడి సహిత శివుని విగ్రహాన్ని పరిశీలించారు. ఈ ప్రాజెక్టులో భాగంగా చెరువు గట్టును బలోపేతం చేసి, పచ్చదనంతో నింపారు. ప్రజలు వ్యాయామం చేసుకునేలా ఓపెన్ జిమ్‌తో పాటు, జాతీయ భావాన్ని పెంపొందించేలా జెండా స్థూపాన్ని కూడా ఏర్పాటు చేశారు. చెరువు పక్కనే చిన్నారుల కోసం ప్రత్యేకంగా అభివృద్ధి చేసిన పార్కును పిల్లలతో కలిసి ప్రారంభించిన పవన్ కళ్యాణ్, వారితో సరదాగా గడిపి చాక్లెట్లు పంచారు.

**రాష్ట్రవ్యాప్తంగా చెరువుల ఆధునికీకరణ**

ప్రధాన మంత్రి కృషి సించాయి యోజన (ఖ్రవీఖూ) నిధులతో రాష్ట్రవ్యాప్తంగా రూ. 50 కోట్లతో 105 చెరువుల సుందరీకరణ పనులు

చేపట్టినట్లు పవన్ కళ్యాణ్ వెల్లడించారు. ఒక్క పిఠాపురం నియోజకవర్గంలోనే రూ. 6 కోట్లతో 11 చెరువులను అభివృద్ధి చేస్తున్నామని, వీటికి సంబంధించిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. కాకినాడ జిల్లా పరిధిలో అభివృద్ధి చేసిన 14 చెరువుల ఫొటో గ్యాలరీని తిలకించారు. ఈ నెలాఖరు నాటికి రాష్ట్రంలోని అన్ని చెరువుల పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు.

పర్యటనలో భాగంగా ఆయన గ్రామ సచివాలయాన్ని, చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాన్ని పరిశీలించారు. గ్రామస్తుల నుంచి వినతులు స్వీకరించి, వారి సమస్యలను ఆప్యాయంగా అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## బంగాళాఖాతంలో వాయుగుండం..
# ఏపీలో 4 రోజులు భారీ వర్షాలు

- మొదటి పేజి తరువాయి

అల్పపీడనం మంగళవారానికి వాయుగుండంగా బలపడనుందని, దీని ఫలితంగా రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు దంచికొడతాయని స్పష్టం చేసింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది. విపత్తుల నిర్వహణ సంస్థ అంచనాల ప్రకారం, మంగళవారం (సెప్టెంబర్ 22) నుంచి రాష్ట్రంలో వర్షాల తీవ్రత పెరగనుంది. ముఖ్యంగా అల్లూరి సీతారామరాజు, పోలవరం, విశాఖపట్నం జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని, మిగిలిన కోస్తాంధ్ర జిల్లాల్లో మోస్తరు వర్షాలు, రాయలసీమ ప్రాంతాల్లో తేలికపాటి జల్లులు పడతాయని తెలిపింది. బుధవారం (సెప్టెంబర్ 23) నాటికి వర్షాల ప్రభావం మరింత పెరగనుంది. అల్లూరి, పోలవరం, ఏలూరు, ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో భారీ వర్షాలు, ఉత్తరాంధ్ర జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొంది. గురు, శుక్రవారాల్లో సైతం కోస్తా జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు.. ప్రకాశం, నెల్లూరు, కర్నూలు, నంద్యాల జిల్లాల్లో మోస్తరు వర్షాలు కురుస్తాయని, మిగిలిన జిల్లాల్లో తేలికపాటి జల్లులు పడతాయని వివరించింది. ఈ నేపథ్యంలో విపత్తుల నిర్వహణ సంస్థ కీలక హెచ్చరికలు జారీ చేసింది. సముద్రం అల్లకల్లోలంగా ఉంటుందని, అలల తీవ్రత ఎక్కువగా ఉంటుందని అంచనా వేసింది. అందువల్ల మత్స్యకారులు తదుపరి ఆదేశాలు వచ్చేవరకు వేటకు వెళ్లరాదని స్పష్టంగా సూచించింది. లోతట్టు ప్రాంతాల ప్రజలు, నదీ పరివాహక ప్రాంతాల వారు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని, రైతులు తమ పంటలను కాపాడుకునేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరింది. ప్రజలు ఎప్పటికప్పుడు అధికారిక ప్రకటనలను గమనిస్తూ, అప్రమత్తంగా ఉండాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

## అఫ్గానిస్థాన్‌పై పాక్ వైమానిక దాడులు.. 28 మంది మృతి..!

- మొదటి పేజి తరువాయి

ఈ రెండు దేశాల మధ్య జరుగుతోన్న ఘర్షణల్లో ఇప్పటికే వందల సంఖ్యలో మరణాలు చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. తాజా వైమానిక దాడులు అఫ్గానిస్థాన్‌లోని కునార్, పక్తికా, ఖోస్త్ ప్రావిన్సులను లక్ష్యంగా చేసుకున్నాయని కాబూల్ అధికారులు వెల్లడించారు. దాడుల్లో పలు నివాసాలు ధ్వంసమయ్యాయన్నారు. పాక్ వైమానిక దాడులను తాలిబన్ ప్రధాన ప్రతినిధి జబీవుల్లా ముజాహిద్ తీవ్రంగా ఖండించారు. రోజురోజుకూ ఇస్లామాబాద్ దురాక్రమణలు పెరిగిపోతున్నాయని దుయ్యబట్టారు. దీనికి ప్రతీకారం తీర్చుకుంటామన్నారు. ఇటీవల పాక్‌లో జరిగిన పలు ఉగ్రదాడులకు ప్రతిస్పందనగా.. అఫ్గాన్‌పై దాడులు చేపడతామని ఆ దేశ సమాచార మంత్రిత్వ శాఖ హెచ్చరించింది. ఈ నేపథ్యంలోనే దాడులు చోటుచేసుకున్నాయి.

## స్టాలిన్ ఓటమి నన్ను షాక్‌కు గురిచేసింది

కొళత్తూరు నియోజకవర్గంలో డీఎంకే అధినేత ఎంకే స్టాలిన్ ఊహించని రీతిలో పరాజయం పాలవడం తనను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని ప్రముఖ సినీ నటుడు ప్రకాశ్ రాజ్ పేర్కొన్నారు. రాష్ట్రంలో మార్పును ఆకాంక్షించే ప్రస్తుత ముఖ్యమంత్రి విజయ్ సారథ్యంలోని టీవీకే ప్రభుత్వాన్ని ప్రజలు ఎన్నుకున్నారని చెప్పారు. విజయ్ ప్రభుత్వ పాలనను అప్పుడే విమర్శించడం సరికాదని... కొత్త ప్రభుత్వానికి కనీసం ఏడాది సమయాన్నయినా ఇవ్వాలని అన్నారు. ఏడాది పాలన పూర్తయిన తాను స్పందిస్తానని చెప్పారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఇప్పటికే సైలెంట్ మోడ్ లోకి వెళ్లిపోయిందని... వారి పతన సమయం ఆసన్నమైందని ప్రకాశ్ రాజ్ వ్యాఖ్యానించారు. త్వరలోనే వారి విధానాల తప్పులకు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. భవిష్యత్తులో రానున్న నియోజకవర్గాల పునర్విభజన బిల్లు దక్షిణాది రాష్ట్రాల పార్లమెంటరీ ప్రాతినిధ్యాన్ని తీవ్రంగా దెబ్బతీస్తుందని, దీనికి ఏ పార్టీ మద్దతు ఇచ్చినా తీవ్రంగా వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. నరేంద్ర మోదీ తనకు వ్యక్తిగతంగా ఇష్టం లేదని, ఆయనకు తాను ఓటు వేయకపోయినా... తనకు కూడా ఆయనే ప్రధానమంత్రి అని చెప్పారు. అందుకే ప్రజా సమస్యలపై ఆయనను నిలదీసే హక్కు తనకు ఉందని స్పష్టం చేశారు.

## ఏపీలో జూడాలకు గుడ్ న్యూస్ చెప్పిన కూటమి ప్రభుత్వం

- మొదటి పేజి తరువాయి

పెంచిన స్టైఫండ్ 2026 జనవరి 1వ తేదీ నుంచి వర్తిస్తుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ నిర్ణయంతో ప్రభుత్వ ఖజానాపై ఏటా రూ. 34.08 కోట్ల అదనపు భారం పడనుంది. వివరాల్లోకి వెళితే, తమ పనిభారానికి తగినట్లుగా స్టైఫండ్ పెంచాలని జూనియర్ డాక్టర్ల అసోసియేషన్ (జూడా) కొంతకాలంగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ఆందోళనలు చేపట్టింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం వారి డిమాండ్లను పరిగణనలోకి తీసుకుని స్టైఫండ్ పెంపునకు ఆమోదం తెలిపింది. ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం, ఎంబీబీఎస్, బీడీఎస్ హౌస్ సర్జన్లకు 10 శాతం స్టైఫండ్ పెంచారు. దీంతో వారి నెలవారీ స్టైఫండ్ రూ. 28,497కి చేరింది. అదేవిధంగా, పీజీ డిగ్రీ, డిప్లొమా కోర్సులు చేస్తున్న వైద్య విద్యార్థులకు 5 శాతం, సూపర్ స్పెషాలిటీ కోర్సులు అభ్యసిస్తున్న వారికి 3.5 శాతం చొప్పున స్టైఫండ్‌ను పెంచారు. ఈ పెంపు నిర్ణయం ఎంబీబీఎస్, బీడీఎస్, పీజీ మెడిసిన్, సూపర్ స్పెషాలిటీ, ఎండీఎస్, డీఎన్‌బీ విద్యార్థులందరికీ వర్తిస్తుంది. జూనియర్ డాక్టర్ల ఆందోళనల నేపథ్యంలో ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం పట్ల వైద్య విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## చైనాకు భారత ఎగుమతులు జోరు.. 40 శాతం వృద్ధి!

- మొదటి పేజి తరువాయి

40 శాతం మేర పెరిగాయి. ముఖ్యంగా 'మేడ్ ఇన్ ఇండియా' ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తులు ఈ వృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. అయినప్పటికీ, ఇరు దేశాల మధ్య వాణిజ్య లోటు ఇప్పటికీ చైనాకు అనుకూలంగా కొనసాగుతోంది. గత ఆర్థిక సంవత్సరంలో చైనాకు భారత ఎలక్ట్రానిక్స్ ఎగుమతులు మూడు రెట్లు పెరిగి 3.18 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. స్మార్ట్‌ఫోన్లు, ప్రింటెడ్ సర్క్యూట్ బోర్డులు, డిస్‌ప్లే మాడ్యూల్స్ వంటివి వీటిలో ప్రధానమైనవి. ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-ఆగస్టు మధ్య కాలంలోనూ ఎలక్ట్రానిక్స్ ఎగుమతులు 15 శాతానికి పైగా పెరిగాయి. ఇదే సమయంలో ఇంజినీరింగ్ వస్తువుల ఎగుమతులు సైతం 21 శాతం మేర వృద్ధిని నమోదు చేశాయి. అంతర్జాతీయంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), డేటా సెంటర్ల కోసం అత్యాధునిక పరికరాలకు డిమాండ్ పెరగడమే ఈ వృద్ధికి ప్రధాన కారణమని పరిశ్రమ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. "ప్రపంచంలోనే అత్యంత పోటీతత్వంతో కూడిన సరఫరా వ్యవస్థలో భారత తయారీ రంగం తన విశ్వసనీయతను చాటుకుంటోంది" అని ఇండియన్ సెల్యులార్ అండ్ ఎలక్ట్రానిక్స్ అసోసియేషన్ ఛైర్మన్ పంకజ్ మోహింద్రూ పేర్కొన్నారు.

అయితే, ఈ వృద్ధి స్వల్ప స్థాయి నుంచి ప్రారంభమవడంతో చైనాతో నెలకొన్న భారీ వాణిజ్య లోటుపై చెప్పుకోదగ్గ ప్రభావం చూపలేదు. గత ఆర్థిక సంవత్సరంలో చైనా నుంచి భారత్ దిగుమతులు 131.6 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. ప్రస్తుతం భారత ఎగుమతులకు అమెరికానే అతిపెద్ద మార్కెట్‌గా కొనసాగుతోంది.

పెన్ పవర్
సెంట్రల్ ఆంధ్ర
ఎన్.టి.ఆర్ జిల్లా । కృష్ణా । గుంటూరు । పల్నాడు । బాపట్ల

# మహాకవి గురజాడ అప్పారావు జయంతి




**చిలకలూరిపేట రూరల్ , పెన్ పవర్, సెప్టెంబర్ 21:**

యడ్లపాడు : జనవిజ్ఞాన వేదిక పల్నాడు జిల్లా ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సాహితీ సాంస్కృతిక దశదినోత్సవాలలో భాగంగా మూడోవ రోజైన సోమవారం మహాకవి గురజాడ అప్పారావు జయంతి జరిగింది. దీన్ని పురస్కరించుకుని యడ్లపాడు లోని నారాయణ ఇంగ్లీష్ మీడియం స్కూలు లో గురజాడ జయంతోత్సవాలు నిర్వహించారు. విద్యార్థులకు తెలికేపల్లి రవి రాసిన జనవిజ్ఞాన వేదిక ప్రచురణ గురజాడ యుగకర్త పుస్తకాలను విద్యార్థులకు బహుమతులు గా అందజేశారు. పిల్లలతో గురజాడ దేశభక్తి గేయం పాడించారు. ప్రముఖ సాహితీ విమర్శకులు డా.పీవీ సుబ్బారావు, బి.అజయ్ బాబు గురజాడ సాహితీ జీవనాన్ని వివరించారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక నాయకులు నూతలపాటి కాళిదాసు, డా.దార్ల బుజ్జిబాబు డా.పీవీ సుబ్బారావు, డివిజన్ అధ్యక్షులు ధూళిపాళ వెంకట రావు , పాఠశాల కార్యదర్శి బ్రహ్మానందం, ప్రిన్సిపాల్ చెరుకూరి సృజన, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయులపై దాడి.. వైసీపీ తీరుపై ఎమ్మెల్యే ఏలూరి ఫైర్
## రాజకీయ కక్షతోనే టీచర్లపై దాడి చేశారన్న ఏలూరి సాంబశివరావు

**బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి డిమాండ్**




మంగళగిరి, సెప్టెంబర్ 21, (పెన్ పవర్) :
న్యాయం కోసం నిరసనకు వచ్చిన ఉపాధ్యాయులపై దాడి చేయడం వైసీపీ రాజకీయ ధోరణికి నిదర్శనమని టీడీపీ ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు విమర్శించారు. మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. ఎస్ఏపీ కార్యాలయం వద్ద తమ న్యాయమైన డిమాండ్ల కోసం నిరసన చేపట్టిన ఉపాధ్యాయులపై వైసీపీ శ్రేణులు దౌర్జన్యంగా దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. ప్రభుత్వం ఈ ఘటనను సీరియస్‌గా తీసుకుని బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

**రౌడీషీటర్లతో దాడి చేయించారంటూ ఆరోపణ**

ప్రకాశం, గుంటూరు, విజయవాడ ప్రాంతాల నుంచి రౌడీషీటర్లను సమీకరించి ఉపాధ్యాయులపై దాడి చేయించారని ఏలూరి ఆరోపించారు. స్పోర్ట్స్ కోటాలో ఎంపికైన ఉపాధ్యాయులు తమకు జరిగిన అన్యాయంపై న్యాయం కోరేందుకు వస్తే వారిపైనే దాడులకు దిగడం రాజకీయ దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. బాధ్యతగల రాజకీయ పార్టీగా వ్యవహరించాల్సిన వైసీపీ కుట్ర రాజకీయాలకు పాల్పడుతోందని విమర్శించారు.

**11 సీట్లకు పరిమితమైనా మార్పు రాలేదు**

గత ఎన్నికల్లో ప్రజలు వైసీపీని 11 సీట్లకు పరిమితం చేసినా ఆ పార్టీ తీరులో మార్పు కనిపించడం లేదని ఏలూరి విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో ఉద్యోగాల విషయంలో నిరుద్యోగులకు అన్యాయం జరిగిందని ఆరోపించారు. డీఎస్సీని అడ్డుకునేందుకు కేసులు, న్యాయపోరాటాలు చేసినా ఫలితం లేకపోవడంతో ఇప్పుడు ఉపాధ్యాయులపై దాడులకు దిగుతున్నారని మండిపడ్డారు. మంత్రి నారా లోకేష్‌కు వస్తున్న ప్రజాదరణను తట్టుకోలేకే ఇలాంటి రాజకీయాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు.

**బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి**

ఉపాధ్యాయులపై జరిగిన దాడిపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలని ఏలూరి సాంబశివరావు కోరారు. ఘటనకు బాధ్యులైన వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చట్టపరంగా చర్యలు తీసుకుని శాంతిభద్రతలను కాపాడాలని ప్రభుత్వాన్ని కోరారు.

# ఆడపిల్లల సంరక్షణపై విస్తృత అవగాహన కార్యక్రమాలు



**బాపట్ల, సెప్టెంబర్ 21 (పెన్ పవర్):**

బాపట్ల జిల్లా వైద్య మరియు ఆరోగ్య అధికారి కార్యాలయంలో డాక్టర్ ఎస్. విజయమ్మ అధ్యక్షతన పి సి ఓ పి ఎన్ డి టి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీసీ ఓ పి ఎన్ డి టి చట్టంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు చేపట్టాల్సిన కార్యాచరణపై చర్చించారు.
జిల్లాలో ఆడపిల్లల శాతం తక్కువగా ఉన్న మండలాలను గుర్తించి, ఆయా ప్రాంతాల్లో ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహించాలని సమావేశంలో నిర్ణయించారు. ఇందుకోసం స్థానిక ఐసిడిఎస్ విభాగం, డ్వాక్రా సంఘాల సహకారం తీసుకోవాలని తీర్మానించారు.
అదేవిధంగా పి సి ఓ పి ఎన్ డి టి చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు రద్దీగా ఉండే ప్రదేశాల్లో వాల్ పోస్టర్లు ఏర్పాటు చేయడంతో పాటు సోషల్ మీడియా ద్వారా అవగాహన వీడియోలను విస్తృతంగా ప్రచారం చేయాలని నిర్ణయించారు. ఇంటర్మీడియట్ విద్యార్థుల్లో ఆడపిల్లల విద్య ఆవశ్యకతపై అవగాహన కల్పించేందుకు వీడియో పోటీలు నిర్వహించనున్నారు. ఉత్తమంగా నిలిచిన వీడియోను ఎంపిక చేసి జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ప్రదర్శించాలని నిర్ణయించారు.
ఈ సమావేశంలో బాపట్ల ప్రభుత్వ ఏరియా వైద్యశాల వైద్యులు, ఎన్జీవో ప్రతినిధులు సపోర్ట్ సంస్థకు చెందిన పఠాన్ మహమ్మద్ ఖాన్, రోజ్ సంస్థ ప్రసాద్, డి బి ఆర్ సి శ్రీలతతో పాటు డి ఎం ఓ హెచ్ ఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# నిందలేయడం..పారిపోవడం,బురదజల్లడం.
# ముఖం చాటేయడం జగన్ కు అలవాటే: ప్రత్తిపాటి

-డీఎస్సీ క్రీడా కోటా అభ్యర్థులు తమ నిజాయితీని నిరూపిస్తాం..రమ్మంటే, భయంతో జగన్ వారిపైకి రౌడీషీటర్లను ఉసిగొల్పాడు : ప్రత్తిపాటి
-2019లో ప్రజలు అనర్హుడిని ముఖ్యమంత్రిని చేసి అనర్థాలు కొని తెచ్చుకున్నారు : ప్రత్తిపాటి
-మెగా డీఎస్సీ 2025కి ఎంపికైన వారంతా అర్హులు..సమర్థులే : ప్రత్తిపాటి.



**చిలకలూరిపేట , పెన్ పవర్, సెప్టెంబర్ 21:**

ప్రజాస్వామ్యంలో నిరాధార ఆరోణలు..నిందలకు ప్రాధాన్యత ఉండదని, అవి ఎప్పటికీ ప్రజలకు చేరువ కావనే వాస్తవాన్ని జగన్ గ్రహించాలి. డీఎస్సీ అక్రమాలంటూ పదేపదే ప్రభుత్వంపై నిందలేస్తున్న జగన్.. వైసీపీనేతలు, మెగా డీఎస్సీకి ఎంపికైన అభ్యర్థుల ప్రశ్నలకు ఎందుకు సమాధానం చెప్పలేకపోతున్నారు. రాజకీయాల్లో ప్రతిసారి తన విశ్వసనీయతను తానే ప్రశ్నార్థకంగా మార్చుకోవడంలో జగన్ ఎప్పుడూ పైచేయి సాధిస్తూనే ఉన్నాడు. తన ప్రభుత్వంలో మంజూరైన స్పోర్ట్స్ సర్టిఫికెట్లను తానే తప్పుపట్టడం ద్వారా జగన్ సెల్ఫ్ గోల్ వేసుకున్నాడు. మంత్రి లోకేశ్ ను ఏదో రకంగా ప్రజల్లో అప్రతిష్ఠ పాలు చేయాలన్న దురాలోచనతోనే జగన్ ప్రతి అంశాన్ని రాజకీయం చేస్తున్నాడని ప్రజలకు పూర్తిగా అర్థమైంది.
మద్యం కుంభకోణమనే విషవృక్ష తల్లివేరు జగన్.. అధికారులు, నాయకులు పిల్లవేర్లు. కూకటివేళ్లతో సహా జగన్ అవినీతిని పెకిలిస్తేనే కల్తీమద్యం మృతులకు ఆత్మశాంతి.. వారి కుటుంబాలకు నిజమైన సంతోషం కలుగుతాయి రూ.3,500 మద్యం స్కామ్ కింగ్ పిన్, లేని డీఎస్సీ అక్రమాలపై ప్రజల్ని తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తూండటం విచారకరం. తన ఐదేళ్ల అక్రమార్జన, అవినీతి వ్యవహారాల లోగుట్లు ఒక్కొక్కటిగా బయట పడుతున్న తరుణంలో, వాటిపై ప్రజల్లో చర్చ జరగకూడదనే జగన్ డీఎస్సీ క్రీడా కోటా అంశాన్ని తెరపైకి తెచ్చి, కష్టపడి ఉద్యోగాలు పొందిన అభ్యర్థుల్ని రోడ్డుకీడుస్తున్నాడు. అభ్యర్థులు బహిరంగంగా రోడ్లపైకి వచ్చి తమ నిజాయితీని నిరూపిస్తాం.. తమను తప్పుపట్టిన వారు బయటకు రావాలంటుంటే జగన్ ముఖం చాటేశాడు. అది చాలదన్నట్టు వైసీపీ గూండాలు, రౌడీ మూకల్ని ఉన్నతులైన ఉపాధ్యాయుల పైకి పంపి ఉన్మాద చర్యలకు పాల్పడ్డాడు.
నిన్నటివరకు డీఎస్సీ అభ్యర్థులపై నిందలేసిన జగన్, నేడు వారిపై గూండాగిరి చేయించడం ఆయనలోని భయాన్ని అభద్రతాభావాన్ని బహిర్గతం చేసింది.
గతంలో కర్నూలు, విజయవాడలో డీఎస్సీ ఉపాధ్యాయులు గొంతెత్తగానే... జగన్, వైసీపీ నేతలు తోకముడిచారు. నేడు డీఎస్సీ స్పోర్ట్స్ కోటా అభ్యర్థులు ఆధారాలతో సహా నిలదీస్తుంటే.. వారిపైకి రౌడీషీటర్లను ఉసిగొల్పి, జగన్ ముఖం చాటేశాడు. వైసీపీ ప్రభుత్వంలో మంజూరైన క్రీడా సర్టిఫికెట్లను జగనే తప్పుపట్టడం ..ఆయన రాజకీయ అజ్ఞానానికి నిదర్శనం. నిందలేయడం.. పారిపోవడం, బురద జల్లడం... జారుకోవడం జగన్ కు అలవాటుగా మారింది.. 2019లో ప్రజలు అనర్హుడిని ముఖ్యమంత్రిని చేసి అనర్థాలు కొని తెచ్చుకున్నారు. కానీ మెగా డీఎస్సీ 2025కి ఎంపికైన వారంతా అర్హులు..సమర్థులే. ఈ సత్యాన్ని గ్రహించనంత కాలం, జగన్ ప్రజల దృష్టిలో రాజకీయ అసమర్థుడిగానే మిగిలిపోతాడు. జగన్ ఎన్ని అభాండాలు వేసినా, ఆరోపణలు చేసినా లోకేశ్ ఛరిష్మాను తగ్గించలేడు. ఆయన పనితీరు, సమర్థతకు ఏ మాత్రం సరితూగలేడు. అర్థం పర్థం లేని ఆరోపణలతో ప్రజల్ని తప్పుదారి పట్టిస్తూ..రాష్ట్రంలో ఉద్రిక్తతలు రేపాలన్నదే జగన్ కుయుక్తి." అని ప్రత్తిపాటి సోమవారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు.

# 5.05 లక్షల మంది పిల్లలకు నులిపురుగుల నిర్మూలన మాత్రలు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



**విజయవాడ, పెన్ పవర్, సెప్టెంబర్, 21,**

ఎన్‌టీఆర్ జిల్లాలో జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని సెప్టెంబర్ 25న, ఆ రోజు వివిధ కారణాల వల్ల మాత్రలు తీసుకోలేకపోయిన పిల్లలకు అక్టోబర్ 5న మాప్-అప్ డే నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. సోమవారం కలెక్టరేట్ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో కలెక్టర్ డా. జి.లక్ష్మీశ.. జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి డా. ఎ.శ్రవణ్ బాబు, వివిధ శాఖల అధికారులతో కలిసి ఆరోగ్యవంతమైన పిల్లల కోసం నులిపురుగులను నులిమేద్దాం.. ప్రచార పోస్టర్లను ఆవిష్కరించారు. సమన్వయ శాఖల అధికారులతో సమావేశమై కార్యక్రమం విజయవంతానికి తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. జిల్లాలో ప్రభుత్వ , ప్రైవేటు విద్యాసంస్థలు కలిపి మొత్తం 3,125 విద్యాసంస్థల్లో జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని.. మొత్తం 5,05,473 మంది పిల్లలను ఈ కార్యక్రమం పరిధిలోకి తీసుకురావాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు అధికారులు వివరించారు. ఒకటి నుంచి 19 ఏళ్లలోపు పిల్లలు, కిశోర బాలలకు అల్బెండజోల్ మాత్రలు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అంగన్వాడీ కార్యకర్తలు తల్లిదండ్రులకు నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం ప్రాముఖ్యతపై అవగాహన కల్పించడంతో పాటు, అర్హులైన పిల్లలను కార్యక్రమంలో భాగస్వామ్యం చేసేలా సమీకరణకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌వో ఎం.లక్ష్మీనరసింహం, ఆర్‌బీఎస్‌కే ప్రోగామ్ ఆఫీసర్ డా. జి.మాధవి, డీఈవో ఎల్.చంద్రకళ, ఐసీడీఎస్ పీడీ షేక్ రుక్సానా బేగం తదితరులు పాల్గొన్నారు.

# గురజాడ.. సామాజిక మార్పునకు స్ఫూర్తిజాడ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ




**విజయవాడ, పెన్ పవర్, సెప్టెంబర్, 21,**

తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసి ప్రజలకు ఆధునిక దిశను చూపడంతో పాటు, తన రచనల ద్వారా సామాజిక చైతన్యాన్ని రగిలించిన మహనీయుడు గురజాడ అప్పారావు అని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. గురజాడ రచనలు సమాజంలోని అసమానతలు, మూఢనమ్మకాలు, సామాజిక రుగ్మతలపై ఆలోచింపజేసి మార్పు వైపు నడిపించాయని పేర్కొన్నారు.
నవయుగ వైతాళికుడు గురజాడ అప్పారావు జయంతి సందర్భంగా సోమవారం కలెక్టరేట్ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ లక్ష్మీశ.. జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, అధికారులతో కలిసి గురజాడ చిత్రపటానికి పూల మాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గురజాడ రచనలు సామాజిక అసమానతలు, మూఢనమ్మకాలపై ఆలోచన రేకెత్తిస్తూ ప్రజల్లో మార్పు కోసం స్ఫూర్తినిచ్చాయని పేర్కొన్నారు. దేశమంటే మట్టికాదోయ్.. దేశమంటే మనుషులోయ్.. అనే గురజాడ సందేశం దేశం, సమాజం పట్ల ప్రతిఒక్కరికీ ఉన్న బాధ్యతను గుర్తుచేస్తోందన్నారు. గురజాడ సాహిత్య స్ఫూర్తితో యువత మానవతా విలువలు, సామాజిక బాధ్యత, సమాజ అభ్యున్నతి పట్ల నిబద్ధతను పెంపొందించుకోవాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు. కార్యక్రమంలో డీఆర్‌వో ఎం.లక్ష్మీనరసింహం, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలి
## జిల్లా జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీ వాస్తవ



**గుంటూరు, పెన్ పవర్,సెప్టెంబర్ 21 :**

ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా ప్రజలు అందిస్తున్న అర్జీల పరిష్కారం నాణ్యతతో కూడినదై ఉండాలని జిల్లా జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీ వాస్తవ అధికారులను ఆదేశించారు.
సోమవారం కలెక్టరేట్లోని శంకరన్ హాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా నలుమూలల నుండి వచ్చిన అర్జీదారుల సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి కృషి చేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యల సత్వర పరిష్కారం కోసం అర్జీలను అందజేస్తుంటారని వారి అర్జీలను నిర్లక్ష్యం చేయకుండా అత్యంత ప్రాధాన్యతతో పరిశీలించాలన్నారు. అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించడంతో పాటు, పరిష్కారం సాధ్యంకాని అంశాలపై స్పష్టమైన కారణాలను అర్జీదారులకు తెలియజేయాలని ఆదేశించారు. ప్రజా సమస్యల సత్వర పరిష్కారమే ప్రభుత్వ యంత్రాంగం ప్రధాన లక్ష్యంగా పనిచేయాలని జాయింట్ కలెక్టర్ స్పష్టం చేశారు.
ఈ కార్యక్రమం లో డి ఆర్ ఓ ఎన్ ఎస్ కె ఖాజావలి, డిప్యుటీ కలెక్టర్ డేవిడ్, డ్వామా పిడి శంకర్, జిల్లా విద్యా శాఖాధికారి సలీం భాష, జిల్లా వ్యవసాయ అధికారి పద్మావతి, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి సత్యనారాయణ, ఇతర శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# 23నఎల్.వి.ప్రసాద్
## కంటి ఆసుపత్రికి శంకుస్థాపన



**గుంటూరు, పెన్ పవర్,సెప్టెంబర్ 21 :**

రాష్ట్ర ముఖ్యమంత్రి ఈ నెల 23వ తేదీనఎల్.వి.ప్రసాద్కంటి ఆసుపత్రి శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొనే అవకాశాలు ఉన్న దృష్ట్యా ఏర్పాట్లను పోలీస్ సూపరింటెండెంట్ వకుల్ జిందాల్ , జాయింట్ కలెక్టర్ అశు తోష్ శ్రీవాస్తవతో కలిసి జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ సోమవారంపరిశీలించారు.
తుళ్లూరు మండలం అబ్బరాజుపాలెంలో ఈ కార్యక్రమం జరగనుంది. వేదిక ఏర్పాటు, పార్కింగ్, ముఖ్య అతిథులు కూర్చునే స్థలాలు, వచ్చే ప్రజానీకం కూర్చునే ఏర్పాట్లు పరిశీలించారు. వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి వి.జ్యోతి బసు,
రెవిన్యూ డివిజనల్ అధికారి కె.శ్రీనివాస రావు, డి.ఆర్.డి.ఏ ప్రాజెక్టు డైరెక్టర్ వి.విజయ లక్ష్మి, ఎం.టి.ఎం.సి కమిషనర్ అలీం భాషా, రహదారులు భవనాలు శాఖ పర్యవేక్షక ఇంజనీర్ శ్రీనివాస్ మూర్తి, డి.ఎస్.పి మురళీ కృష్ణ, జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి బి.వి.రంగా రావు, గ్రామీణ నీటి సరఫరా విభాగం పర్యవేక్షక ఇంజనీర్ కె.కళ్యాణ చక్రవర్తి, జిల్లా పౌర సరఫరాల అధికారి పి.కోమలి పద్మ, జిల్లా పంచాయతీ అధికారి బి.వి.నాగ సాయి కుమార్,

# చీరాల మున్సిపాలిటీని వైసీపీ కైవసం చేసుకోవాలి

## కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలి: కరణం వెంకటేష్ బాబు

**చీరాల సెప్టెంబర్ 21 (పెన్ పవర్):**
రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులంతా సమష్టిగా పనిచేసి చీరాల మున్సిపాలిటీని కైవసం చేసుకోవాలని ఆ పార్టీ చీరాల నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ బాబు పిలుపునిచ్చారు. చీరాలలోని పేరాల గోలి సదాశివరావు కళ్యాణ మండపంలో ఆయన ఆధ్వర్యంలో వైసీపీ పట్టణ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు.
ఈ సందర్భంగా కరణం వెంకటేష్ బాబు మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలను పార్టీ శ్రేణులు ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలని సూచించారు. ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేసి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని అన్నారు. ప్రజల్లోకి వెళ్లి వారి సమస్యలను తెలుసుకోవడంతో పాటు, నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.
కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సంక్షేమ కార్యక్రమాలను గాలికొదిలేసిందని కరణం వెంకటేష్ బాబు విమర్శించారు. స్పోర్ట్స్ కోటాలో జరిగిన డీఎస్సీ నియామకాల్లో అక్రమాలు జరిగాయని ఆరోపించారు. చిత్తశుద్ధితో పనిచేసే నాయకత్వం కోసం



ప్రజలు ఎదురుచూస్తున్నారని ఆయన పేర్కొన్నారు.
రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేసి పార్టీని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.
సమావేశంలో వైసీపీ రాష్ట్ర చేనేత విభాగ అధ్యక్షులు బీరక సురేంద్ర, చీరాల పట్టణ వైసీపీ అధ్యక్షులు యాతం మేరి బాబు, బాపట్ల జిల్లా వాణిజ్య విభాగ అధ్యక్షులు చీమకుర్తి బాలకృష్ణ, జిల్లా మున్సిపల్ విభాగ అధ్యక్షులు బత్తుల అనిల్, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు వాసిమల్ల వాసు, మాజీ వైస్ చైర్మన్ బొనిగల జైసన్ బాబు, గోశాల ఆశీర్వాదం, గుంటూరు ప్రభాకర్, లీగల్ సెల్ అధ్యక్షులు రాజు వెంకటేశ్వర్ రెడ్డి, నియోజకవర్గ బూత్ కన్వీనర్ల అధ్యక్షులు సురేష్, డాక్టర్ వింగ్ అధ్యక్షులు బాబురావు, మైనార్టీ సెల్ కార్యదర్శి కబీర్‌తో పాటు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎస్ఆర్‌కేటీ కాలనీకి తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

## రూ .30 లక్షలతో ప్రధాన డ్రెయిన్.. ఆర్‌డబ్ల్యూఎస్ ద్వారా నీటి వసతుల కల్పన

**దోర్ టు దోర్ కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు**





నరసరావుపేట, పెన్ పవర్ సెప్టెంబరు21:
నరసరావుపేట పట్టణంలోని ఎస్ఆర్‌కేటీ కాలనీలో తాగునీటి సమస్యను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు తెలిపారు. సోమవారం కాలనీలో నిర్వహించిన డోర్ టు డోర్ కార్యక్రమంలో ఆయన పర్యటించిస్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎస్ఆర్‌కేటీ కాలనీ నిర్మాణం 1999లో జరిగిందని, అప్పటి తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో డాక్టర్ కోడెల శివప్రసాదరావు ఆధ్వర్యంలో పేదలకు ఇళ్ల స్థలాలు కల్పించినట్లు తెలిపారు. ప్రస్తుతం కాలనీలో ప్రధానంగా తాగునీటి సమస్య ఉందని, ఆర్‌డబ్ల్యూఎస్ పథకం కింద వాటర్ హెడ్ ట్యాంక్ నిర్మాణం చేపట్టినట్లు చెప్పారు. పంప్‌హౌస్ నిర్మాణంతో పాటు పైపులైన్లు ఏర్పాటు చేసి ఒకటి, రెండు నెలల్లో కాలనీకి తాగునీటి సరఫరాను మెరుగుపరుస్తామని పేర్కొన్నారు. కాలనీలోని అన్ని లైన్లకు నీరు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. మురుగునీటి సమస్య పరిష్కారానికి సుమారు రూ.30 లక్షలతో ప్రధాన డ్రెయిన్ నిర్మాణం చేపడుతున్నట్లు చెప్పారు. అదేవిధంగా ఆర్‌డబ్ల్యూఎస్ కింద సుమారు రూ.50 లక్షలతో నీటి వసతుల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. ఎస్ఆర్‌కేటీ కాలనీలో నివసించే వారు ప్రధానంగా తక్కువ ఆదాయ వర్గాలకు చెందిన వారని, చిన్నచిన్న కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కాలనీ అభివృద్ధికి ప్రభుత్వం తరఫున పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. ప్రతి రోడ్డుకు సైడ్ డ్రెయిన్ల నిర్మాణానికి మున్సిపాలిటీ చర్యలు తీసుకుంటుందని చెప్పారు.కాలనీలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసుల పర్యవేక్షణ కొనసాగుతోందని, అక్రమ మద్యం విక్రయాలు, బెల్ట్ షాపులు, గంజాయి విక్రయాలను అరికట్టేందుకు చర్యలు తీసుకున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. కాలనీ ప్రజలకు ఎటువంటి సమస్య వచ్చినా ప్రభుత్వం, కూటమి నాయకులు అండగా ఉంటారని హామీ ఇచ్చారు.కాలనీ అభివృద్ధిపై జిల్లా కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించారని, మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి ఎస్ఆర్‌కేటీ కాలనీని అభివృద్ధి చేస్తామని చెప్పారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సంక్షేమంతో పాటు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా అర్హులైన కుటుంబాలకు పెన్షన్లు, తల్లికి వందనం తదితర ప్రయోజనాలు అందుతున్నాయని తెలిపారు. ఎస్ఆర్‌కేటీ కాలనీ నాయకులు, కార్యకర్తలు పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారని, వారికి కృతజ్ఞతలు తెలిపారు.

# చీరాలకు మరో వరం.. రూ.30 కోట్ల నిధులు

**-పట్టణ మౌలిక వసతుల అభివృద్ధి పథకం కింద మంజూరు**
**-ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య వెల్లడి**

**చీరాల, సెప్టెంబర్ 21 (పెన్ పవర్):**
చీరాల పురపాలక సంఘం అభివృద్ధికి మరో కీలక ముందడుగు పడింది. పట్టణ మౌలిక వసతుల అభివృద్ధి పథకం కింద చీరాల పట్టణానికి రూ.30 కోట్ల నిధులు మంజూరైనట్లు చీరాల శాసనసభ్యులు మద్దులూరి మాలకొండయ్య తెలిపారు. ఈ నిధులతో పట్టణంలో మౌలిక వసతుల అభివృద్ధికి సంబంధించిన పలు పనులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.
రాష్ట్రంలోని పురపాలక సంఘాల్లో సిమెంట్ రోడ్లు,



పార్కుల అభివృద్ధి పనులకు హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (హెచ్ ఏ ఎం) విధానంలో మొత్తం రూ.7,469.46 కోట్లతో చేపట్టే అభివృద్ధి పనులకు ఈ నెల 22వ తేదీ మంగళవారం ఉదయం 10 గంటలకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేయనున్నారు.
చీరాల పురపాలక సంఘం ఓపెన్ ఎయిర్ థియేటర్‌లో నిర్వహించే కార్యక్రమంలో ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య పాల్గొననున్నారు. కార్యక్రమానికి చీరాల పురపాలక సంఘ స్పెషల్ ఆఫీసర్, ఆర్డీఓతో పాటు మున్సిపల్ సెక్షన్ హెడ్‌లు, ఇండోర్, అవుట్‌డోర్ సిబ్బంది, మెప్మా సిబ్బంది హాజరుకానున్నారు. చీరాల పట్టణ అభివృద్ధికి మంజూరైన నిధులతో మౌలిక వసతులు మరింత మెరుగుపడనున్నాయని అధికారులు తెలిపారు.

# ప్రజల భద్రతే లక్ష్యంగా సమగ్ర కార్యాచరణ : కలెక్టర్ లక్ష్మీశ, సీపీ రాజశేఖర్ బాబు






**విజయవాడ, పెన్ పవర్,సెప్టెంబర్ 21:**
ప్రజల భద్రత, సంక్షేమాన్ని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా ఎన్టీఆర్ జిల్లాలో 'ఆపరేషన్ త్రిశూల్' కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో సీపీ ఎస్.వి. రాజశేఖర్ బాబుతో కలిసి ఆపరేషన్ త్రిశూల్ సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు.
ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డ్రగ్స్ నియంత్రణ, మహిళలపై నేరాల నివారణ, రోడ్డు ప్రమాదాల నియంత్రణ అనే మూడు అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తూ దీనిని సమగ్ర ప్రజా భద్రతా కార్యక్రమంగా అమలు చేయాలని సూచించారు.
ఎన్టీఆర్ జిల్లాలో రోడ్డు ప్రమాదాలు 1,122 నుంచి 557కు, ప్రమాద మరణాలు 426 నుంచి 285కు తగ్గినట్లు కలెక్టర్ తెలిపారు. అయితే ఒక్క ప్రాణాన్ని కూడా కోల్పోకుండా చూడటమే తదుపరి లక్ష్యమని పేర్కొన్నారు. ప్రతి తీవ్రమైన ప్రమాదాన్ని సమగ్రంగా విశ్లేషించి బ్లాక్‌స్పాట్ల వద్ద అవసరమైన భద్రతా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.
సీపీ ఎస్.వి. రాజశేఖర్ బాబు మాట్లాడుతూ గతంతో పోలిస్తే జిల్లాలో మొత్తం నేరాలు 6,814 నుంచి 5,692కు తగ్గాయని తెలిపారు. డ్రగ్స్ సరఫరా, విక్రయాలపై కఠిన చర్యలతో పాటు వినియోగదారులకు కౌన్సెలింగ్, పునరావాసం కల్పిస్తున్నట్లు చెప్పారు. మహిళలపై నేరాలు కూడా 1,281 నుంచి 1,092కు తగ్గాయని తెలిపారు.
యువతను డ్రగ్స్‌కు దూరంగా ఉంచడం, మహిళలకు భద్రత కల్పించడం, రోడ్లపై ప్రాణాలను కాపాడటమే ఆపరేషన్ త్రిశూల్ ప్రధాన లక్ష్యాలని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా ప్రచార గోడపత్రికను ఆవిష్కరించి, ప్రచార రథాన్ని ప్రారంభించారు. అనంతరం అధికారులు, పోలీసు సిబ్బంది ర్యాలీలో పాల్గొన్నారు.
కార్యక్రమంలో డీసీపీలు కేజీవి సరిత, జి. రామకృష్ణ, డీఎంహెచ్‌వో డా. ఎ. శ్రవణ్ బాబు, ఐసీడీఎస్ పీడీ షేక్ రుక్సానా బేగం, పోలీస్, రవాణా, వైద్య శాఖల అధికారులు, ఈగల్, త్రిశూల్ బృందాల సిబ్బంది పాల్గొన్నారు.

# కారంపూడిలో ఘనంగా ఎన్ఎస్పీ కాలనీలో

## మహా గణపతి శోభయాత్ర వేడుకలు




**పెన్ పవర్ కారంపూడి సెప్టెంబర్ 21:**
కారంపూడి పట్టణం లోని ఎన్ఎస్పీ కాలనీలోని స్వయంభు వినాయక ఆలయంలో 15వ మహాగణపతి శోభయాత్ర సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆలయం పక్కనే ఏర్పాటు చేసిన వేదికపై ఉత్సవ కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు భారీ అన్నదానం చేశారు. అన్నదానంలో వేలాది సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. లడ్డూ వేలం లో రూ. 71000 తో కొత్రపాటి మురళి దక్కించుకున్నారు. అనంతరం కులం మతాలకతీతంగా, వినాయకుడి నిమజ్జనం నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. మండల పరిధిలోని అన్ని శాఖల అధికారులు, నాయకుల ప్రోత్సాహంతో కార్యక్రమాన్ని ఎంత విజయవంతంగా నిర్వహించమన్నారు. ఆ మహాగణపతి ఆశీస్సులతో ఎలాంటి ఆటంకాలు లేకుండా ఎనిమిది రోజులు కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్పీ కాలనీ యూత్ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

# కారంపూడి మండలం చింతపల్లి గ్రామంలో విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



**పెన్ పవర్ కారంపూడి సెప్టెంబర్ 21:**
కారంపూడి మండలంచింతపల్లి గ్రామంలో ఈరోజు ఉదయం 9గంటలకు విషాదం చోటుచేసుకుంది. గ్రామంలోని శివాలయం వెనుక నాగులేరు అనగా వేపకంపల్లి వెళ్లే దారిలో ఈ ప్రమాదం జరిగింది.
మృతుడు లంక శేషయ్య (40), తండ్రి చిన్న నాగయ్య. ఇతను చింతపల్లి గ్రామానికి చెందినవాడు. శేషయ్య వృత్తిరీత్యా కరెంట్ పనులు చేస్తుంటాడు.
అదే గ్రామానికి చెందిన వేముల శ్రీను వరి చేను పొలంలో ట్రాన్స్‌ఫార్మర్ పనిచేయడం లేదని శేషయ్యను పొలం వద్దకు తీసుకెళ్లాడు. కరెంట్ చూడటం నిమిత్తం వెళ్లిన శేషయ్య ట్రాన్స్‌ఫార్మర్ వైర్లు పట్టుకుని పరిశీలిస్తుండగా విద్యుత్ షాక్ తగిలింది.విద్యుత్ షాక్ తగలడంతో శేషయ్య అక్కడికక్కడే కుప్పకూలి మృతి చెందాడు.
ఈ ఘటనపై కుటుంబ సభ్యులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి బయలుదేరి విచారణ చేపడుతున్నారు.
9/21/20268 ౦91 99858 98077:

# జాతీయ స్థాయి చక్ బాల్ పోటీలకు చిలకలూరిపేట విద్యార్థిని ఎంపిక




**చిలకలూరిపేట , పెన్ పవర్, సెప్టెంబర్ 21:**
చిలకలూరిపేట ఎస్.కె.కె. ఎస్.సి.వి.ఎస్ జూనియర్ కళాశాలలో సీనియర్ ఇంటర్ చదువుతున్న విద్యార్థిని వలేరు శైలజ జాతీయ స్థాయి చక్ బాల్ పోటీలకు ఎంపికయ్యారు. అక్టోబర్ 8 నుండి 10 వరకు అస్సాంలోని గౌహతిలో జరగనున్న 17వ జూనియర్ నేషనల్ చక్ బాల్ ఛాంపియన్‌షిప్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జట్టు తరఫున పల్నాడు జిల్లా నుండి ఆమె ప్రాతినిధ్యం వహించనున్నట్లు ఏపీ చక్ బాల్ అసోసియేషన్ తెలిపింది. ఈ సందర్భంగా జాతీయ స్థాయికి ఎంపికైన శైలజను కళాశాల యాజమాన్యం ఘనంగా అభినందించింది. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించడం గర్వకారణమని, జాతీయ స్థాయిలో విజయం సాధించి కళాశాలకు మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఆమె మంచి పేరు తీసుకురావాలని యాజమాన్యం ఆకాంక్షించింది. ఈ అభినందన కార్యక్రమంలో కళాశాల అధ్యక్షులు తేళ్ల సుబ్బారావు, కార్యదర్శి మైలవరపు శివానంద కుమార్, ఉపాధ్యక్షులు డా. కందిమళ్ళ సాంబశివరావు, జాయింట్ సెక్రటరీ బేతంచెర్ల రామకోటేశ్వరరావు, కోశాధికారి బచ్చు రామలింగేశ్వరరావు, ప్రిన్సిపాల్ పుల్లెల శ్రీనివాసరావు మరియు ఫిజికల్ డైరెక్టర్ ఎన్. మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# గతం కంటే ఘనంగా దసరా మహోత్సవాలు



**విజయవాడ, పెన్ పవర్,సెప్టెంబర్ 21:**
విజయవాడ ఇంద్రకీలాద్రిపై అక్టోబర్ 10 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించనున్న శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామివారి దసరా మహోత్సవాలను గతం కంటే ఘనంగా, భక్తులకు మరింత సౌకర్యవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల సమన్వయంతో విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు దేవాదాయ శాఖ కార్యదర్శి కె.కన్నబాబు తెలిపారు. జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో దసరా ఏర్పాట్లపై అధికారులు చర్చించారు. భక్తుల భద్రతకు ఏఐ సాంకేతికతనువినియోగించడంతో పాటు ఏఐ కెమెరాలు, డ్రోన్లు, డిజిటల్ స్క్రీన్లు, ప్రత్యేక మొబైల్ యాప్‌లను అందుబాటులోకి తీసుకురానున్నారు. క్యూలైన్లలో భక్తులకు దర్శనానికి పట్టే సమయాన్ని ఎప్పటికప్పుడు తెలియజేసేలా చర్యలు చేపడుతున్నారు.మొత్తం 22 పార్కింగ్ ప్రాంతాలు, మూడు హోల్డింగ్ ఏరియాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేయనున్నారు. స్మార్ట్ లడ్డూ వెండింగ్ మెషీన్లు, తాగునీరు, మరుగుదొడ్లు, వైద్య సేవలు, పారిశుధ్యం, రవాణా తదితర సౌకర్యాలను కల్పించనున్నారు. సామాన్య భక్తులకు ఇబ్బందులు లేకుండా ఉచిత దర్శనాలు, ప్రసాదాల పంపిణీకి ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు.దుర్గాఘాట్ సమీపంలో 24 గంటలూ పనిచేసే కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను ఏర్పాటు చేసి, క్షేత్రస్థాయి సమాచారాన్ని ఎప్పటికప్పుడు సమన్వయం చేయనున్నారు. భక్తుల ఫిర్యాదులు, సూచనలపై తక్షణమే స్పందించేలా సిబ్బందిని అందుబాటులో ఉంచనున్నారు.
దసరా ఉత్సవాలకు సుమారు 20 లక్షల మంది భక్తులు వచ్చే అవకాశం ఉన్నప్పటికీ ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. భక్తుల భద్రత కోసం క్యూఆర్ కోడ్ ఆధారిత చైల్డ్ ట్రాకింగ్ సిస్టమ్‌ను కూడా అమలు చేయనున్నట్లు సీపీ ఎస్‌వీ రాజశేఖరబాబు తెలిపారు.
సమావేశంలో వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర, దేవాదాయ శాఖ కమిషనర్ కె.రామచంద్రమోహన్, దుర్గగుడి ఈవో వీకే శీనా నాయక్ తదితరులు పాల్గొన్నారు. అక్టోబర్ 16న మూలా నక్షత్రం రోజున ముఖ్యమంత్రి ఆలయానికి రానున్న నేపథ్యంలో చేపట్టాల్సిన భద్రతా, ఇతర ఏర్పాట్లపైనా అధికారులు సమీక్షించారు.

# నవయుగ వైతాళికుడు గురజాడ జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ



**గుంటూరు, పెన్ పవర్,సెప్టెంబర్ 21:**
నవయుగ వైతాళికుడు, మహాకవి గురజాడ వెంకట అప్పారావు అని జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ అన్నారు. గురజాడ వెంకట అప్పారావు 164వ జయంతి వేడుకలు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ఘనంగా జరిగాయి. గురజాడ చిత్ర పటానికి జిల్లా కలెక్టర్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మహాకవి గురజాడ వెంకట అప్పారావు తెలుగు సాహిత్యానికి, సామాజిక సంస్కరణలకు అందించిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. గురజాడ రచనలు సమాజంలో మార్పుకు, ప్రజల్లో చైతన్యానికి మార్గదర్శకంగా నిలిచాయని పేర్కొన్నారు.దేశమంటే మట్టి కాదోయ్.. దేశమంటే మనుషులోయ్' అంటూ గురజాడ అందించిన సందేశం నేటికీ స్ఫూర్తిదాయకమని అన్నారు. బాల్యవివాహాలు, సాంఘిక దురాచారాలు, మూఢనమ్మకాల నిర్మూలనకు గురజాడ చేసిన కృషి సమాజానికి ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. వ్యవహారిక భాషా ఉద్యమంలో కీలక పాత్ర పోషించారని అన్నారు. గురజాడ ఆశయాలను భావితరాలకు అందించేందుకు, ఆయన సాహిత్యాన్ని, సామాజిక సందేశాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. గురజాడ రచనలు సమాజంలో చైతన్యాన్ని నింపి, ప్రజల్లో సామాజిక మార్పుకు బాటలు వేశాయని అన్నారు. సామాజిక సమానత్వం, మూఢనమ్మకాల నిర్మూలన వంటి అంశాలపై గురజాడ అందించిన సందేశాలు ముఖ్యంగా కన్యాశుల్కం నాటకం ఇప్పటి సమాజానికి కూడా ప్రతీకగా నిలుస్తుందని అన్నారు.
ఈ కార్యక్రమంలో స్టెప్ సి.ఇ.ఓ పి.వి.వి సత్యనారాయణ, పర్యాటక శాఖ అధికారి రమ్య, జిల్లా కలెక్టర్ కార్యాలయ పరిపాలన అధికారి మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# వైసిపి నాయకుడు పోతిని మహేష్ నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడు రాచకొండ లక్ష్మయ్య

**గుంటూరు,పెన్ పవర్, సెప్టెంబర్, 21**

విజయవాడ వైసిపి నాయకులు పోతిని మహేష్ నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడు గుంటూరు పట్నంలో అభివృద్ధి జరిగిందో రా గుంటూరు ఏ ఏరియా కి వెళ్ళిన అభివృద్ధి చూపిస్తా అని జిల్లా బీసీ సెల్ అధికార ప్రతినిధి లక్ష్మయ్య హెచ్చరిస్తూ వైసిపి కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ నీవు నాలుగోడాల మధ్య కాదు మాట్లాడాల్సింది గుంటూరు పట్టణంలో ఏ ప్రాంతానికి ఏ డివిజన్ కైనా వచ్చి చూడు గత ప్రభుత్వం లో ఎంత అభివృద్ధి జరిగింది ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఎంత అభివృద్ధి జరిగింది, నీవు గత ప్రభుత్వంలో ఎంత అభివృద్ధి జరిగిందో చూపించే దమ్ము ధైర్యం నీకు ఉందా?? గుంటూరు పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యురాలు బీసీ సామాజిక వర్గం చెందిన రజక మహిళని అభివృద్ధి శూన్యం అని మాట్లాడుతున్నావు గుంటూరు తూర్పు నియోజకవర్గం ఎంత అభివృద్ధి జరిగిందో చూపిస్తాను చర్చకు సిద్ధమని లక్ష్మయ్య మహేష్ కి సవాల్ చేశారు, నీవు ఎవరి నొప్పి కోసమో మాట్లాడుతున్నావో ప్రతి డివిజన్లో వేల కోట్ల రూపాయలతో అభివృద్ధి కార్యక్రమాలు సైట్ కాలువలు



రోడ్లు వేల కిలోమీటర్లు వేయడం జరిగింది, గత ప్రభుత్వంలో కాంట్రాక్టర్లు కూడా ఎంతోమంది మారారు వారి దగ్గర డబ్బులు తీసుకొని కాంట్రాక్ట్ ఇవ్వకుండా జరిగింది. ఈరోజు ఏ డివిజన్ కి వెళ్ళిన అభివృద్ధి గురించి ప్రజలు చెబుతారు, నీవు మీ జగన్మోహన్ రెడ్డి దగ్గర పాయింట్లు కొట్టాలని తెలుగుదేశం ప్రభుత్వం పై ఏది పడితే మాట్లాడుతున్నావ్ జాగ్రత్త నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడు జిల్లా బీసీ సెల్ అధికార

# గురజాడ అప్పారావు జయంతి ఘనంగా నిర్వహణ



**గుంటూరు: పెన్ పవర్, సెప్టెంబర్, 21,**

జిల్లా పరిషత్ కార్యాలయంలో చైర్‌పర్సన్ శ్రీమతి కత్తెర హెనీ క్రిస్టినా ఆధ్వర్యంలో ప్రముఖ కవి, రచయిత, సంఘ సంస్కర్త గురజాడ అప్పారావు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గురజాడ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

తెలుగు సాహిత్యానికి, సామాజిక సంస్కరణకు గురజాడ అందించిన సేవలను చైర్‌పర్సన్ స్మరించారు."దేశమంటే మట్టి కాదోయ్.. దేశమంటే మనుషులోయ్" అనే సందేశం ద్వారా మానవతా విలువలు, సమానత్వం, సామాజిక బాధ్యతపై ప్రజల్లో చైతన్యం కల్పించారని పేర్కొన్నారు.

కార్యక్రమంలో జిల్లా పరిషత్ అధికారులు, సిబ్బంది, ఏవో శామ్యూల్ పాల్, రత్నబాబు, మల్లేశ్వరరావు, టీ. శ్రీనివాస్, సహాయకులు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఇద్దరు బాలికలకు చట్టబద్ధంగా దత్తత

**విజయవాడ, సెప్టెంబర్ 21:**

శిశు గృహ సంరక్షణలో ఉన్న ఇద్దరు బాలికలకు జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ ఆధ్వర్యంలో సోమవారం చట్టబద్ధమైన దత్తత ప్రక్రియ నిర్వహించారు. జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని ప్రత్యేక దత్తత సంస్థలో ఈ ప్రక్రియ చేపట్టారు.

దత్తతలో భాగంగా బాలికల గుర్తింపు వివరాలు, దత్తత తల్లిదండ్రుల ఆధార్ కార్డులు, ఇతర ధ్రువపత్రాలు, అవసరమైన రికార్డులను అధికారులు పరిశీలించారు. అన్ని చట్టపరమైన నిబంధనలు, నిర్దేశిత విధానాలను తప్పనిసరిగా పాటించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.బాలికల ఆరోగ్య పరిస్థితి, వైద్య పరీక్షలు, ఆరోగ్య రికార్డులపై వివరాలు తెలుసుకున్న కలెక్టర్.. ఆ వివరాలను దత్తత తల్లిదండ్రులకు పూర్తిగా తెలియజేయాలని సూచించారు. బాలికలను ప్రేమతో, బాధ్యతతో పెంచుతూ వారి ఆరోగ్యం, పోషణ, విద్య, భద్రత, సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.దత్తత అనంతరం బాలికలకు కన్నబిడ్డలతో సమానంగా హక్కులు, కుటుంబ సౌకర్యాలు



కల్పించాలని తెలిపారు. పిల్లలకు సురక్షితమైన కుటుంబ వాతావరణం, మెరుగైన భవిష్యత్తు అందించేందుకు సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ షేక్ రుక్సానా సుల్తానా బేగం, జిల్లా బాలల పరిరక్షణ అధికారి ఎం. రాజేశ్వరరావు, లీగల్ ఆఫీసర్ కిరణ్ కుమార్, శిశు గృహ మేనేజర్ దీపిక, సోషల్ వర్కర్ అరుణ తదితరులు పాల్గొన్నారు.

# గురజాడ అప్పారావు జయంతి ఘనంగా నిర్వహణ




**గుంటూరు, పెన్ పవర్,సెప్టెంబర్ 21:**

జిల్లా కేంద్ర గ్రంథాలయం-గుంటూరు మీటింగ్ హాల్‌లో ఉమ్మడి గుంటూరు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ భీమనేని వందనా దేవి ఆధ్వర్యంలో ప్రముఖ కవి, రచయిత, నాటకకర్త, సంఘ సంస్కర్త గురజాడ అప్పారావు 164వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా గురజాడ అప్పారావు చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. అంటరానితనం, బాల్యవివాహాలు, కన్యాశుల్కం వంటి సామాజిక దురాచారాలపై తన రచనల ద్వారా పోరాడిన మహనీయుడు గురజాడ అని కొనియాడారు.దేశమంటే మట్టి కాదోయ్.. దేశమంటే మనుషులోయ్" అనే సందేశం ద్వారా దేశానికి నిజమైన సంపద ప్రజలేనని గురజాడ చాటి చెప్పారని తెలిపారు. తెలుగు సాహిత్యంలో అభ్యుదయ భావాలకు ఆయన చేసిన కృషి చిరస్మరణీయమన్నారు.కార్యక్రమంలో ఉప గ్రంథపాలకురాలు కందుల ఝాన్సీ లక్ష్మి, గ్రంథాలయ, కార్యాలయ సిబ్బంది, విద్యార్థులు, గ్రంథపాఠకులు పాల్గొన్నారు.

# ఏపీ రెసిడెన్షియల్ స్కూల్ (మైనార్టీ బాలుర)విద్యార్థుల ప్రతిభ

**గుంటూరు, పెన్ పవర్,సెప్టెంబర్ 21:**

యోగఅసోసియేషన్‌గుంటూరు జిల్లా ఆధ్వర్యంలో గుంటూరులోని ముస్నంగి హైస్కూల్‌లో ఆదివారం నిర్వహించిన జిల్లా స్థాయి యోగా పోటీల్లో ఏపీ రెసిడెన్షియల్ స్కూల్ (ఉర్దూ బాలుర) విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. వివిధ విభాగాల్లో అత్యుత్తమ ప్రదర్శనతో మొత్తం ఏడుగురు విద్యార్థులు రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ఎంపికయ్యారు.

14--18 సంవత్సరాల విభాగంలో ఇద్దరు, 8--14 సంవత్సరాల విభాగంలో ఐదుగురు విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారు. రాష్ట్రస్థాయి యోగా పోటీలు అక్టోబర్ 10, 11 తేదీల్లో నెల్లూరు జిల్లా కావలిలో నిర్వహించనున్నారు.రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎం. రజిని, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ ఆర్. శ్రీనివాసులు అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లోనూ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి



పాఠశాలకు, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని వారు ఆకాంక్షించారు.

# పందిళ్లపల్లి గ్రామ కార్యదర్శికి ఉత్తమ సేవా అవార్డు




**వేటపాలెం, సెప్టెంబర్ 21 (పెన్ పవర్) :**

మండలంలోని పందిళ్లపల్లి గ్రామ కార్యదర్శి మాల్యాద్రిరావు పీజీఆర్ఎస్ (ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ) అర్జీల పరిష్కార విభాగంలో ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ చేతుల మీదుగా ఉత్తమ సేవా అవార్డును అందుకున్నారు.ఈ సందర్భంగా పందిళ్లపల్లి మాజీ ఉపసర్పంచ్, నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షుడు పాలకొల్లు చంద్రశేఖర్ మాల్యాద్రిరావును అభినందించారు. విధి నిర్వహణలో నిబద్ధతతో పనిచేస్తూ అవార్డుకు అర్హత సాధించారని పేర్కొన్నారు.

గ్రామ కార్యాలయానికి వచ్చే ప్రజలను మర్యాదపూర్వకంగా ఆహ్వానించి వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు కృషి చేస్తారని తెలిపారు. కింది స్థాయి సిబ్బందిని గౌరవిస్తూ, ఉన్నతాధికారుల సూచనలను పాటిస్తూ విధులు నిర్వహిస్తున్నారని కొనియాడారు. గ్రామ పారిశుద్ధ్య నిర్వహణతో పాటు కార్మికుల జీతభత్యాల విషయంలోనూ ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా విధులు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు.

మాల్యాద్రిరావుకు ఉత్తమ సేవా అవార్డు లభించడం పందిళ్లపల్లి గ్రామానికి గర్వకారణమని చంద్రశేఖర్ అన్నారు.

# చీరాల ప్రాంతంలో అక్రమ లేఅవుట్లపై చర్యలు తీసుకోవాలి

## 1200 ఎకరాల్లో అనుమతులు లేకుండా వెంచర్లు వేశారని ఆరోపణ

**జాయింట్ ఇన్‌స్పెక్షన్ నిర్వహించి రిజిస్ట్రేషన్లు నిలిపివేయాలి: ఆమంచి**

**ఒంగోలు, సెప్టెంబర్ 21, (పెన్ పవర్) :**

లచీరాల ప్రాంతంలో అక్రమ రియల్ ఎస్టేట్ దందా జోరుగా సాగుతోందని, డీటీసీపీ, ఔడా నిబంధనలను ఉల్లంఘిస్తూ సుమారు 1200 ఎకరాల్లో ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమ లేఅవుట్లు ఏర్పాటు చేశారని చీరాల మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ ఆరోపించారు. ఈ వ్యవహారంపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం ఒంగోలు కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్)లో ప్రకాశం జిల్లా జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారికి వినతిపత్రం అందజేశారు.

అనంతరం మీడియాతో ఆమంచి కృష్ణమోహన్ మాట్లాడుతూ.. చీరాల తీర ప్రాంతంలో భూముల



ధరలు భారీగా పెరగడంతో కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు నిబంధనలను పక్కనపెట్టి అక్రమ లేఅవుట్లకు పాల్పడుతున్నారని ఆరోపించారు. నిబంధనల ప్రకారం లేఅవుట్లు ఏర్పాటు చేసే సమయంలో ప్రజా అవసరాల కోసం నిర్దేశిత స్థలాన్ని ఓపెన్ స్పేస్‌గా కేటాయించడంతో పాటు రోడ్లు, ఇతర మౌలిక సదుపాయాలకు స్థలం కేటాయించాల్సి ఉంటుందని తెలిపారు.

అయితే నిబంధనలను పాటించకుండా మొత్తం భూమిని ప్లాట్లుగా విభజించి విక్రయిస్తున్నారని ఆయన ఆరోపించారు. ఔడా పర్యవేక్షణ లోపం, స్థానిక అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ఇలాంటి అక్రమ లేఅవుట్లు పెరుగుతున్నాయని విమర్శించారు.

అనుమతులు లేని లేఅవుట్లపై రెవెన్యూ, పంచాయతీ, ఔడా అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న లేఅవుట్లను గుర్తించి బాధ్యులపై చర్యలు తీసుకోవడంతో పాటు, అనుమతులు లేని లేఅవుట్లలో ప్లాట్ల రిజిస్ట్రేషన్లను తక్షణమే నిలిపివేయాలని జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారిని కోరినట్లు ఆమంచి తెలిపారు.

# బాపట్లకు మరో వరం.. రూ.29 కోట్ల నిధులు

## పట్టణ మౌలిక వసతుల అభివృద్ధికి భారీగా నిధులు

**ఏడాదిలో వివిధ పథకాల ద్వారా రూ.50 కోట్లకు పైగా కేటాయింపు: ఎమ్మెల్యే నరేంద్ర వర్మ**

**బాపట్ల, సెప్టెంబర్ 21, (పెన్ పవర్) :**

అభివృద్ధి పథంలో బాపట్ల పురపాలక సంఘం మరింత ముందుకు సాగనుందని ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ తెలిపారు. పట్టణ మౌలిక వసతుల అభివృద్ధి పథకం కింద బాపట్ల పట్టణానికి రూ.29 కోట్ల నిధులు మంజూరైనట్లు ఆయన వెల్లడించారు. ఈ నెల 22న కుప్పంలో జరిగే కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వర్చువల్ విధానంలో రాష్ట్రవ్యాప్తంగా చేపట్టనున్న అభివృద్ధి ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టనున్నారు. బాపట్ల పురపాలక సంఘ కార్యాలయంలో నిర్వహించే ప్రత్యక్ష ప్రసార కార్యక్రమంలో ఎమ్మెల్యే నరేంద్ర వర్మ పాల్గొననున్నారు.

రూ.29 కోట్ల నిధులతో బాపట్ల పట్టణంలో పలు కీలక మౌలిక వసతుల పనులు చేపట్టేందుకు ప్రణాళిక రూపొందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ప్రధానంగా రహదారుల అభివృద్ధి, వీధి దీపాల ఏర్పాటు, పార్కుల అభివృద్ధి తదితర పనులకు ఈ నిధులను వినియోగించనున్నట్లు పేర్కొన్నారు. పట్టణంలో పెరుగుతున్న అవసరాలకు అనుగుణంగా మౌలిక



వసతులను బలోపేతం చేసి ప్రజలకు మెరుగైన సదుపాయాలు కల్పించడమే లక్ష్యమన్నారు.

ఇప్పటికే అమృత్ 2.0 పథకం కింద బాపట్ల మున్సిపాలిటీకి రూ.22 కోట్ల నిధులు మంజూరయ్యాయని నరేంద్ర వర్మ తెలిపారు. తాగునీటి సరఫరా, నీటి వనరుల అభివృద్ధి తదితర పనులకు ఈ నిధులను వినియోగిస్తున్నట్లు చెప్పారు. తాజాగా పట్టణ మౌలిక వసతుల అభివృద్ధి పథకం కింద మరో రూ.29 కోట్లు మంజూరు కావడంతో ఈ ఏడాది వివిధ పథకాల ద్వారా బాపట్ల పురపాలక సంఘానికి రూ.50 కోట్లకు పైగా నిధులు అందుబాటులోకి వచ్చినట్లు వివరించారు.

రాష్ట్రంలోని పలు పట్టణాల్లో హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ ద్వారా చేపట్టనున్న అభివృద్ధి పనులకు సంబంధించిన కార్యక్రమం కూడా ఈ సందర్భంగా జరగనుందని తెలిపారు. రాష్ట్రంలోని మున్సిపాలిటీల్లో రహదారులు, ఇతర పట్టణ మౌలిక వసతులకు సంబంధించిన భారీ ప్రాజెక్టులు ప్రస్తుతం టెండర్ దశలో ఉన్నాయని పేర్కొన్నారు.

రూ.29 కోట్లతో చేపట్టనున్న పనులు పూర్తయితే బాపట్ల పట్టణంలోని ప్రధాన రహదారులు, పార్కులు, వీధి దీపాలు తదితర సదుపాయాల్లో గణనీయమైన మార్పులు వచ్చే అవకాశం ఉందని ఎమ్మెల్యే అన్నారు. తాగునీటి మౌలిక వసతులను మరింత బలోపేతం చేయడం ద్వారా పట్టణ ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అవకాశం ఏర్పడుతుందని తెలిపారు. ఒకే ఏడాదిలో వివిధ పథకాల ద్వారా రూ.50 కోట్లకు పైగా నిధులు బాపట్ల పట్టణ అభివృద్ధికి అందుబాటులోకి రావడం కీలక పరిణామమని నరేంద్ర వర్మ అన్నారు. ఇంత పెద్ద మొత్తంలో నిధులు మంజూరు కావడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. బాపట్ల పురపాలక సంఘ సంపూర్ణ అభివృద్ధికి సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగుతున్నామని తెలిపారు.

ఈ అభివృద్ధి కార్యక్రమాలకు సహకరిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, రాష్ట్ర మంత్రి నారా లోకేష్, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు ఎమ్మెల్యే నరేంద్ర వర్మ కృతజ్ఞతలు తెలిపారు.

# పోషకాహారంతోనే సంపూర్ణ ఎదుగుదల

**వేటపాలెం, సెప్టెంబర్ 21, (పెన్ పవర్) :**

గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యవంతమైన జీవనానికి బాటలు వేసుకోవచ్చని వేటపాలెం వెస్ట్ ప్రాథమికపాఠశాలప్రధానోపాధ్యాయురాలు శివపార్వతి అన్నారు. 9వ జాతీయ పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా సోమవారం సర్వోదయ కాలనీ-2 అంగన్వాడీ కేంద్రంలో సెక్టార్ పరిధిలో నిర్వహించిన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.

పిల్లల మానసిక వికాసానికి అంగన్వాడీలు దోహదం, గర్భం ధరించిన ప్రతి మహిళ పౌష్టికాహారం తీసుకుని ఆరోగ్యవంతమైన బిడ్డకు జన్మనివ్వాలని శివపార్వతి సూచించారు. ఆరు సంవత్సరాల లోపు చిన్నారుల శారీరక ఎదుగుదలతో పాటు మానసిక వికాసం, ఆటపాటలకు అంగన్వాడీ కేంద్రాలు ఎంతో దోహదపడుతున్నాయని తెలిపారు.



ఐసీడీఎస్ పర్యవేక్షకురాలు సజ్జ పుష్పవల్లి మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల ద్వారా 11 రకాల పోషకాహార పదార్థాలను అందిస్తున్నామని తెలిపారు. వాటిని క్రమం తప్పకుండా తీసుకోవడం ద్వారా చిన్నారుల ఎదుగుదల మెరుగుపడుతుందని పేర్కొన్నారు. ఒత్తిడి లేని విద్యను అందించడంలో అంగన్వాడీ కేంద్రాలు కీలకపాత్ర పోషిస్తున్నాయని అన్నారు.

ఈ సందర్భంగా అంగన్వాడీ కార్యకర్తలు పోషక విలువలు అధికంగా ఉన్న ఆహార పదార్థాలు, లడ్డూలు, చిరుధాన్యాలతో తయారు చేసిన పిండి వంటలను ప్రదర్శించారు. వాటి ప్రయోజనాలను తల్లులకు వివరించి, ఆహార పదార్థాలను అందజేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌ఓ డి.సిరోను రాణి, ఏఎన్ఎం మాధవి, మహిళా పోలీస్ పి.పద్మజ, అంగన్వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు, తల్లులు పాల్గొన్నారు.

పందిళ్లపల్లిలోనూ పోషకాహార మాసోత్సవాలు

పందిళ్లపల్లి అంగన్వాడీ-4 కేంద్రంలో సెక్టార్ పరిధిలో జాతీయ పోషకాహార మాసోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఐసీడీఎస్ పర్యవేక్షకురాలు సజ్జ పుష్పవల్లి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు పోషక విలువలతో కూడిన పిండి వంటలను తయారు చేసి ప్రదర్శించారు.

ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ హిమాంబి, హెచ్‌వీ ప్రభావతి, ఏఎన్ఎం శ్రీలక్ష్మి, అంగన్వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

# కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటాం : విడదల రజిని

## స్థానిక ఎన్నికల్లో ప్రతి చోటా వైఎస్సార్‌సీపీ పోటీ చేయాలి: మాజీ మంత్రి విడదల రజిని

**చిలకలూరిపేట రూరల్ , పెన్ పవర్, సెప్టెంబర్ 21:**

నాదెండ్ల మండలం సాతులూరు గ్రామంలో మాజీ మంత్రి విడదల రజిని ఆధ్వర్యంలో ఆదివారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులను సమాయత్తం చేయడం, గ్రామస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా ఈ సమావేశం జరిగింది.ఈ సందర్భంగా మాజీ మంత్రి విడదల రజిని మాట్లాడుతూ.. పార్టీ కోసం కష్టకాలంలోనూ అంకితభావంతో పనిచేసిన ప్రతి నాయకుడు, కార్యకర్తకు వైఎస్సార్‌సీపీ ఎప్పటికీ అండగా ఉంటుందని అన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి గ్రామంలో పార్టీ అభ్యర్థులు పోటీ చేసేలా శ్రేణులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.ప్రతి చోటా పోటీ చేయాలి.. రాజీ అనే మాటకు తావుండకూడదు. కార్యకర్తలకు ఎక్కడైనా ఇబ్బంది వస్తే నేను స్వయంగా అక్కడికి వచ్చి అండగా నిలబడతానుఅని విడదల రజిని స్పష్టం చేశారు. నియోజకవర్గంలో పార్టీని నమ్ముకుని పనిచేస్తున్న ప్రతి కార్యకర్తకు తగిన గౌరవం, ప్రాధాన్యత కల్పించడంతో పాటు వారి సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. నాయకులు, కార్యకర్తలు ఎవరూ అధైర్యపడకుండా ఐక్యంగా ముందుకు సాగాలని సూచించారు.

ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ వాటిపై పోరాడాలని పార్టీ శ్రేణులకు సూచించారు.




గ్రామస్థాయిలో నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని అన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఇప్పటి నుంచే గ్రామాల్లో పార్టీ కార్యక్రమాలను విస్తృతం చేయాలని పిలుపునిచ్చారు.

జగనన్న 2.0 పాలనలో కార్యకర్తలదే కీలక పాత్ర ఉంటుందని విడదల రజిని గారు పేర్కొన్నారు. పార్టీ కోసం శ్రమించిన ప్రతి కార్యకర్త సేవలను గుర్తించి, వారికి తగిన గౌరవం, ప్రాధాన్యత కల్పించే విధంగా ముందుకు సాగుతామని తెలిపారు. కార్యకర్తల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తామని అన్నారు.

అనంతరం పార్టీలో వివిధ హోదాల్లో నియమితులైన నాయకులు, కార్యకర్తలకు వైఎస్సార్‌సీపీ ఐడీ కార్డులను పంపిణీ చేశారు. పార్టీ కోసం పనిచేస్తున్న ప్రతి ఒక్కరికీ పార్టీ అండగా ఉంటుందని ఈ సందర్భంగా మరోసారి భరోసా ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ పరిశీలకులు చిట్టా విజయ భాస్కర్ రెడ్డి గారు, నాదెండ్ల మండల నాయకులు, గ్రామాల పార్టీ అధ్యక్షులు, వివిధ హోదాల్లో నియమితులైన నాయకులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## 48 గంటల్లో వీధి దీపాల ఫిర్యాదుల పరిష్కారం కమిషనర్ కె.మయూర్ అశోక్




**గుంటూరు, పెన్ పవర్,సెప్టెంబర్ 21:**
నగరంలో వీధి దీపాలకు సంబంధించి ప్రజల నుంచి వచ్చే ప్రతి ఫిర్యాదును 48 గంటల్లో పరిష్కరించేలా ప్రత్యేక కార్యాచరణ చేపట్టినట్లు నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ తెలిపారు. రాత్రి వేళల్లో ప్రజల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా వీధి దీపాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించినట్లు పేర్కొన్నారు.
నగరంలో సుమారు 35 వేల ఎల్ఈడీ వీధి దీపాలు ఉన్నాయని, అవసరమైన డ్రైవర్లు, ఇతర సామగ్రిని సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు. ఫిర్యాదుల ఆధారంగా డ్రైవర్ల మార్పు, వైరింగ్ సమస్యల పరిష్కారం తదితర పనులను టెక్నీషియన్లు చేపడుతున్నారన్నారు. సాయంత్రం వేళల్లో పెట్రోలింగ్ నిర్వహించి పనిచేయని దీపాలను గుర్తించి, ఉదయాన్నే మరమ్మతులు చేపడుతున్నట్లు కమిషనర్ తెలిపారు.

## విజయవాడలో జాతీయ సబ్‌జూనియర్ బాస్కెట్‌బాల్ పోటీలు

**విజయవాడ, పెన్ పవర్,సెప్టెంబర్ 21:**
విజయవాడ నగరంలో ఈ నెల 27 నుంచి అక్టోబర్ 4 వరకు 51వ సబ్‌జూనియర్ జాతీయ బాస్కెట్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ వైస్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎస్.భరణి తెలిపారు. పోటీల నిర్వహణకు అన్ని శాఖలు సమన్వయంతో పటిష్ట ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.
ఆర్టీసీ కాలనీ మేరీస్ స్టెల్లా కాలేజ్ ఇండోర్ స్టేడియం, పటమట చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియం, కోనేరు బసవయ్య చౌదరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తదితర వేదికల్లో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి శాఖ తరఫున నోడల్ అధికారులను నియమించి సమన్వయంతో ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు.
క్రీడాకారులకు మెరుగైన వైద్య, భద్రత, పారిశుధ్య సదుపాయాలు కల్పించాలని, ప్రతి వేదిక వద్ద అంబులెన్సులు, వైద్య బృందాలను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. విద్యుత్, ఫ్లడ్‌లైట్లు, అగ్నిమాపక భద్రత, బయో టాయిలెట్లు, దోమల నివారణ తదితర




ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని సూచించారు.
పాఠశాలల్లో నిర్వహించే మ్యాచ్‌ల వల్ల విద్యార్థుల తరగతులకు అంతరాయం కలగకుండా షెడ్యూల్ రూపొందించాలని, టోర్నమెంట్ వివరాలను మీడియాకు ప్రతిరోజూ అందించాలని తెలిపారు. జాతీయ స్థాయి పోటీలను విజయవంతంగా నిర్వహించి విజయవాడకు మంచి గుర్తింపు తీసుకురావాలని ఎస్.భరణి అధికారులకు సూచించారు.

## తెలుగు వారి గుండె చప్పుడు గురజాడ



**మచిలీపట్నం,పెన్ పవర్, సెప్టెంబర్ 21**
ఆధునిక తెలుగు సాహిత్యానికి గురజాడ అప్పారావు దిక్సూచి అని సాహితీవేత్త డాక్టర్ బి. ధన్వంతరి ఆచార్య అన్నారు. సోమవారం స్థానిక బుట్టాయిపేట వివేకానంద మందిరంలో బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో గురజాడ అప్పారావు జయంతిని ఘనంగా నిర్వహించారు. తొలుత గురజాడ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా డాక్టర్ బి. ధన్వంతరి ఆచార్య మాట్లాడుతూ గురజాడ రచనలు సమాజాన్ని చైతన్యపరిచేలా ఉన్నాయని తెలిపారు. సామాన్యుడు మాట్లాడే భాషలోనే సాహిత్యం ఉండాలని చాటి, అనేక రచనలతో ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చిన యుగకర్త గురజాడ అని ప్రముఖ న్యాయవాది లంకిశెట్టి బాలాజీ అన్నారు. కన్యాశుల్కం, దిద్దుబాటు, ముత్యాల సరాలు, పూర్ణమ్మ వంటి రచనలు నేటికీ ప్రజల మదిలో నిలిచిపోయాయని పేర్కొన్నారు.రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పి.వి. ఫణికుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బ్రాహ్మణ కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ విజయవాడ బ్రాంచ్ మేనేజర్ గొర్తి శ్రీనివాసరావు, బ్రాహ్మణ సంఘ ప్రతినిధులు మోపర్తి సుబ్రహ్మణ్యం, పి.ఎస్.ఎస్.ఆర్. శర్మ, కె.ఆర్.కె.యం. భవిష్య, సింగరాజు గోవర్ధన్, దూళిపాల శ్రీరామచంద్రమూర్తి, ఎం.వి.ఎస్.ఆర్.కె. మూర్తి, రఘు తదితరులు పాల్గొన్నారు.

## ఏపీలో తొలిసారిగా క్యాన్సర్ రోగులకు జన్యు పరీక్షలు

**పెన్ పవర్,సెప్టెంబర్ 21:**
ఆంధ్రప్రదేశ్‌లో వైద్య రంగంలో మరో కీలక మైలురాయి త్వరలో ఆవిష్కృతం కానుంది. క్యాన్సర్ మహమ్మారితో పోరాడుతున్న రోగులకు మరింత మెరుగైన, ఆధునిక వైద్యం అందించే లక్ష్యంతో గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాల (జీజీహెచ్) లోని నాట్కో క్యాన్సర్ సెంటర్‌లో సరికొత్త అడుగు పడుతోంది. క్యాన్సర్ రోగుల కోసం రాష్ట్రంలోనే తొలిసారిగా ప్రత్యేక జన్యు పరీక్షా ల్యాబ్‌ను ఏర్పాటు చేశారు. ఈ అత్యాధునిక ల్యాబ్‌ను ఎల్లుండి రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అధికారికంగా ప్రారంభించనున్నారు.
రాష్ట్ర చరిత్రలో క్యాన్సర్ రోగులకు జన్యు పరీక్షలు అందుబాటులోకి రావడం ఇదే మొదటిసారి కావడం విశేషం. సాధారణంగా క్యాన్సర్ వ్యాధి నిర్ధారణ, దాని తీవ్రతను అంచనా వేయడంలో జన్యుపరమైన అంశాలు అత్యంత కీలకం. ఈ ల్యాబ్ అందుబాటులోకి వస్తే రోగి శరీరంలోని క్యాన్సర్ కణాల జన్యువులను విశ్లేషించి, ఆ వ్యాధికి కారణమైన కారకాలను కచ్చితంగా గుర్తించడానికి వీలవుతుంది. దీని ద్వారా వైద్యులు రోగికి సరిగ్గా ఏ రకమైన కీమోథెరపీ లేదా టార్గెటెడ్ థెరపీ అవసరమో ముందే అంచనా వేసి అత్యంత సమర్థవంతమైన చికిత్స అందించడానికి మార్గం సుగమమవుతుంది.
ఇక భవిష్యత్తు ప్రణాళికల్లో భాగంగా, ఈ సేవలను మరింత విస్తరించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇందులో భాగంగానే భవిష్యత్తులో అమరావతి క్వాంటం వ్యాలీలో మరింత విస్తృతమైన వసతులతో పూర్తి స్థాయి కేంద్రాన్ని ఏర్పాటు చేసే ప్రతిపాదనలు కూడా ఉన్నట్లు తెలుస్తోంది. మొత్తంగా, ఈ జన్యు పరీక్షా ల్యాబ్ ప్రారంభం కావడం వల్ల క్యాన్సర్ నిర్ధారణలోనూ, రోగులకు అందించే అత్యాధునిక చికిత్సలోనూ వైద్య రంగానికి ఒక సరికొత్త




దిశ లభించనుంది.

## జగిత్యాల ప్రజావాణిలో పలు సమస్యలపై 57 వినతులు స్వీకరించిన జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్


**జగిత్యాల జిల్లా పెన్ పవర్,సెప్టెంబర్ 21:**
ప్రజావాణి ద్వారా ప్రజల నుండి అందుతున్న ఫిర్యాదులు, వినతులపై సమగ్ర విచారణ జరిపి సమస్యలను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు.
సోమవారం జగిత్యాల కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ ప్రజల నుండి ఫిర్యాదులు, వినతులను స్వీకరించారు.
**ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ**
జిల్లా కేంద్రంతో పాటు వివిధ మండలాల నుండి ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణి కార్యక్రమానికి వస్తున్నారని తెలిపారు. ప్రజల నుండి అందుతున్న ప్రతి ఫిర్యాదును అధికారులు బాధ్యతాయుతంగా తీసుకొని, సంబంధిత సమస్యపై సమగ్ర విచారణ జరిపి సత్వర పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సూచించారు.
ప్రజావాణి ద్వారా అందిన అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిశీలించి, నిర్ణీత సమయంలో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం లేకుండా ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.




ఈరోజు నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం, 57 ఫిర్యాదులు, వినతులు అందాయని, వాటిని సంబంధిత శాఖల అధికారులు పరిశీలించి తగిన చర్యలు తీసుకొని పరిష్కరించాలని సూచించారు.
ప్రజావాణి ద్వారా అందిన ప్రతి దరఖాస్తును అధికారులు ప్రాధాన్యతతో పరిశీలించి, సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టడంతో పాటు దరఖాస్తుదారులకు తగిన సమాచారం అందించాలని పేర్కొన్నారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు సకాలంలో అందే విధంగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు.
ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) బిఎస్ లత, అడిషనల్ కలెక్టర్ (లోకల్ బాడీస్) బి. రాజ గౌడ్, డిఆర్ఓ కె. వై ప్రసాద్, జిల్లా అధికారులు, వివిధ శాఖల అధికారులు, మున్సిపల్ కమిషనర్లు మరియు తదితరులు పాల్గొన్నారు.

## దాచేపల్లి భూములపై ఆర్టీఐ పిడుగు!

**వార్తాలోకం, పెన్ పవర్,సెప్టెంబర్ 21:**
మార్నింగ్ న్యూస్
దాచేపల్లి భూముల రికార్డుల గుట్టు రట్టు: ఆర్టీఐ దరఖాస్తుతో వెలుగులోకి సంచలన విషయాలు!
పల్నాడు జిల్లా (కంబైన్డ్ గుంటూరు జిల్లా పరిధిలోని) దాచేపల్లి మండలంలో భూముల రికార్డులకు సంబంధించి సమాచార హక్కు చట్టం (RTI) ద్వారా బయటపడిన వివరాలు స్థానికంగా సంచలనం సృష్టిస్తున్నాయి. ప్రభుత్వ భూముల రికార్డులు, డీకే పట్టాల కేటాయింపులు మరియు సర్వే నంబర్ల లెక్కలపై తలెత్తిన అనుమానాలపై పూర్తి స్థాయి విచారణ కోరుతూ వెలువడిన ముఖ్యాంశాల పూర్తి వివరాలు ఇక్కడ ఉన్నాయి:
డాక్టర్ బండి సురేంద్ర బాబు దరఖాస్తు & **తహశీల్దార్ సమాధానం:**
దాచేపల్లి ప్రాంతంలోని భూ రికార్డుల అక్రమాలు మరియు అవకతవకలపై డాక్టర్ బండి సురేంద్ర బాబు స్థానిక తహశీల్దార్ కార్యాలయానికి ఆర్టీఐ (RTI) దరఖాస్తు సమర్పించారు. దీనికి స్పందించిన దాచేపల్లి తహశీల్దార్ కార్యాలయం అందించిన సమాధానం ఇప్పుడు భూ సేకరణ మరియు కేటాయింపులపై పెద్ద




చర్చకు దారితీసింది.
సర్వే నంబర్ 807/16 లో 268 ఎకరాల భారీ **లెక్క తేడా:**
అధికారిక రికార్డుల ప్రకారం సర్వే నంబర్ 807/16 పరిధిలో ఉన్న మొత్తం 268 ఎకరాల భూమిలెక్కపై తీవ్రమైన ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఈ భారీ విస్తీర్ణానికిసంబంధించినఅసలులబ్ధిదారులుఎవరు,ఎవరికి ఎంత కేటాయించారనే దానిపై స్పష్టత కొరవడింది.
**పాత రికార్డులు వర్సెస్ ప్రస్తుత డీకే పట్టాలు:**
గతంలో ఉన్న అసలైన పాత ప్రభుత్వ రికార్డులలో ఈ భూమి స్పష్టంగా "ప్రభుత్వ భూమి"గా నమోదై ఉంది. అయితే, అదే ప్రభుత్వ భూమిలో డీకే పట్టాలు ఎలా పుట్టాయనే కోణంలో ఇప్పుడు పెద్ద ఎత్తున విచారణ డిమాండ్ వ్యక్తమవుతోంది. అసలు ఎలాంటి నిబంధనల ప్రకారం అర్హులైన పేదలకు ఇవ్వాల్సిన డీకే పట్టాలు ఇక్కడ ఆ భూమిలో సృష్టించబడ్డాయనేది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది.
**భూ రికార్డుల్లో సంచలన మార్పులు:**
ప్రభుత్వ భూమిని ప్రైవేటు వ్యక్తుల పరం చేసేందుకు రికార్డులను ఏ విధంగా తారుమారు చేశారనే అంశంపై ఆర్టీఐ ద్వారా దొరికిన పత్రాలు రెవెన్యూ వర్గాల్లో కలకలం రేపుతున్నాయి. పాత రికార్డులను మార్చి కొత్తగా ఎంట్రీలు చేసిన తీరుపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపితే మరిన్ని నిజాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

## పెట్రోల్ బంకుల్లో యూపీఐ చెల్లింపులపై భారీ షాక్.. రూ. 200 దాటితే కేవలం 'క్యాష్' మాత్రమే! కేంద్రానికి తేల్చిచెప్తున్న డీలర్లు


**వార్తాలోకం పెన్ పవర్,సెప్టెంబర్ 21:**
పూర్తి వార్తా కథనం:రాష్ట్రంలోని పెట్రోల్ బంకుల్లో డిజిటల్ లావాదేవీలకు సంబంధించి తలెత్తిన తాజా పరిణామాలు వాహనదారులకు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. పెట్రోల్ బంకుల్లో యూపీఐ (UPI) ద్వారా నిర్వహించే డిజిటల్ చెల్లింపులపై విధించతలపెట్టిన అదనపు ఛార్జీలు మరియు నిబంధనల అంశం ప్రస్తుతం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ముఖ్యంగా రూ. 200 మించిన లావాదేవీలపై పడుతున్న ఆర్థిక భారం కారణంగా, పెట్రోలియం డీలర్లు అత్యంత కఠినమైన నిర్ణయాల వైపు అడుగులు వేస్తూ కేంద్ర ప్రభుత్వానికి గట్టి హెచ్చరికలు జారీ చేస్తున్నారు.
డీలర్ల ఆవేదన – లాభాల కంటే భారమే ఎక్కువ:
సాధారణంగా లీటరు పెట్రోల్, డీజిల్ విక్రయాలపై డీలర్లకు వచ్చే కమిషన్ లేదా మార్జిన్ అత్యంత నామమాత్రంగా ఉంటుంది. ఈ తరుణంలో రూ. 200 దాటిన ప్రతి యూపీఐ చెల్లింపునకు సంబంధించి మర్చంట్ డిస్కౌంట్ రేట్ (MDR) లేదా బ్యాంక్ ఛార్జీల రూపంలో తమపై మోయలేని భారం పడుతోందని డీలర్లు వాపోతున్నారు. రోజువారీ నిర్వహణ వ్యత్యాసాలు, విద్యుత్ బిల్లులు, సిబ్బంది జీతాలు పోను..




డిజిటల్ లావాదేవీలకు చెల్లించే కమిషన్లు తమ వ్యాపారాన్ని కోలుకోలేని దెబ్బతీస్తున్నాయని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.
రూ. 200 దాటితే డిజిటల్ బంద్.. నగదు రూపంలోనే చెల్లింపులు:
ఈ పరిస్థితుల నేపథ్యంలో డీలర్లు ఒక కీలక నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. రూ. 200 దాటిన ఏ లావాదేవీకైనా ఆన్‌లైన్ లేదా యూపీఐ స్కానర్లను అనుమతించే ప్రసక్తే లేదని, ఇకపై రూ. 200 దాటితే కేవలం 'క్యాష్' (నగదు) రూపంలోనే నగదు చెల్లించాలని స్పష్టం చేస్తున్నారు. ఈ నిబంధన అమలైతే ప్రయాణికులు, ద్విచక్ర మరియు నాలుగు చక్రాల వాహనదారులు బంకుల వద్ద తీవ్ర ఇబ్బందులను ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఎందుకంటే చాలా మంది సామాన్య ప్రజలు చిల్లర నగదు వెంట ఉంచుకోకుండా పూర్తిగా ఫోన్‌పే, గూగుల్ పే వంటి యూపీఐ యాప్‌లపైనే ఆధారపడుతున్నారు.
కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని డిమాండ్:
ఈ పరిణామాల పట్ల వాహనదారులు, రవాణా రంగ కార్మికులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. డిజిటల్ ఇండియా వైపు దేశం అడుగులు వేస్తున్న తరుణంలో, పెట్రోల్ బంకుల వద్ద మళ్లీ నగదు లావాదేవీల నిబంధన అమలకి వస్తే సామాన్యులకు తీవ్ర అసౌకర్యం కలుగుతుందని పేర్కొంటున్నారు. తక్షణమే కేంద్ర ప్రభుత్వం మరియు బ్యాంకింగ్ రంగాలు స్పందించి, యూపీఐ ఛార్జీల భారాన్ని తగ్గించేలా లేదా పూర్తిగా మినహాయించేలా తగిన చర్యలు తీసుకోవాలని డీలర్లు స్పష్టం చేస్తున్నారు. లేనిపక్షంలో అక్టోబర్ మధ్యనాటికి రాష్ట్రవ్యాప్తంగా పెట్రోల్ బంకుల్లో డిజిటల్ సేవలు నిలిచిపోయి, కేవలం క్యాష్ పద్ధతే ప్రధాన మార్గంగా మళ్లే ప్రమాదం స్పష్టంగా కనిపిస్తోంది.

## వీరాపూర్ 4, 6వ వార్డుల సమస్యలు పరిష్కరించాలి.ప్రజావాణిలో జిల్లా కలెక్టర్‌కు గ్రామస్థుల వినతి.

**రాయికల్‌పెన్ పవర్,సెప్టెంబర్ 21:**
జగిత్యాల జిల్లా రాయికల్ మండలం వీరాపూర్ గ్రామంలోని 4వ, 6వ వార్డుల్లో నెలకొన్న మౌలిక వసతుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆయా వార్డుల గ్రామస్థులు సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో జగిత్యాల జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రాలు సమర్పించారు. 4వ వార్డులో సుమారు 45 మంది ఓటర్లు నివసిస్తున్న ప్రాంతంలో గత 15 సంవత్సరాలుగా పలు మౌలిక వసతుల సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదని గ్రామస్థులు తెలిపారు ముఖ్యంగా సోమ ధర్మయ్య ఇంటి నుంచి జవ్వాజి శ్రీనివాస్ ఇంటి వరకు సీసీ రోడ్డు నిర్మించడంతో పాటు డ్రైనేజీ సౌకర్యం కల్పించాలని కోరారు. వర్షాకాలంలో డ్రైనేజీ లేక నీరు ఇళ్ల పరిసరాల్లో నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఈ మురికి నీరు ఆగడం వల్ల విష జ్వరాలు ప్రబలుతున్నాయని వారు పేర్కొన్నారు
అదేవిధంగా 6వ వార్డులోని ఆరోవాడ మహేంద్ర నగర్



కాలనీలో మట్టి రోడ్డును సీసీ రోడ్డుగా అభివృద్ధి చేయాలని, విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయడంతో పాటు డ్రైనేజీ నిర్మాణం చేపట్టాలని కోరారు. ప్రధాన రహదారి నుంచి కాలనీలోని ఇళ్ల వరకు సరైన డ్రైనేజీ లేక వర్షపు నీరు, మురుగునీరు నిలిచిపోతున్నాయని తెలిపారు. రెండు వార్డుల్లోని సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, సీసీ రోడ్లు, డ్రైనేజీలు, విద్యుత్ సౌకర్యం




వంటి మౌలిక వసతుల పనులను త్వరితగతిన చేపట్టేలా సంబంధిత అధికారులను ఆదేశించాలని గ్రామస్థులు జిల్లా కలెక్టర్‌ను కోరారు. కార్యక్రమంలో చెదల శంకర్, జవ్వాజి శ్రీనివాస్ గౌడ్, కనికరపు స్వామి, నీలి మల్లయ్య, సోమ రాములు, సోమ బుచ్చన్న, సోమ వరలక్ష్మి, సోమ రాజు, సోమ నవ్య తదితరులు పాల్గొన్నారు.

# లోకల్ పోల్స్ కు కాంగ్రెస్ రెడీ...



**విజయవాడ, సెప్టెంబర్ 21, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో సుదీర్ఘకాలంగా సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న కాంగ్రెస్ పార్టీ, రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను వేదికగా చేసుకుని పూర్వవైభవం సాధించేందుకు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల సారథ్యంలో పార్టీని క్షేత్రస్థాయి నుంచి పునర్నిర్మించే క్రమంలో 10 మంది సీనియర్ నేతలతో కూడిన రాష్ట్ర స్థాయి మానిటరింగ్ కమిటీ ని ఏర్పాటు చేయడం ఆసక్తికరంగా మారింది. ఈ కమిటీకి సీడబ్ల్యూసీ సభ్యుడు, మాజీ పీసీసీ చీఫ్ ఎన్. రఘువీరారెడ్డిని ఛైర్మన్‌గా, మాజీ కేంద్ర మంత్రి జేడీ శీలంను కన్వీనర్‌గా నియమించడం ద్వారా కాంగ్రెస్ తన పాత కాపులను, అనుభవజ్ఞులను మళ్లీ ప్రధాన స్రవంతిలోకి తెచ్చేందుకు తగిన వేదికను సిద్ధం చేసింది. ఈ తాజా నియామకాల్లో ప్రధానంగా ఆకట్టుకుంటున్న అంశం రఘువీరారెడ్డి రీ-ఎంట్రీ. రాష్ట్ర విభజన అనంతరం అత్యంత క్లిష్టమైన పరిస్థితుల్లో పీసీసీ అధ్యక్షుడిగా పార్టీని నడిపిన ఆయన, గత కొంతకాలంగా ప్రత్యక్ష రాజకీయాలకు దూరంగా ఉంటూ ఆధ్యాత్మిక, వ్యవసాయ కార్యక్రమాలకే పరిమితమయ్యారు. అయితే, రాయలసీమతో పాటు రాష్ట్రవ్యాప్తంగా వివాదరహిత నాయకుడిగా, సౌమ్యుడిగా ఆయనకున్న మంచి పేరును వాడుకోవాలని ఏఐసీసీ భావించింది. బిసి, యాదవ సామాజిక వర్గానికి చెందిన సీనియర్ నేతగా, ఉమ్మడి ఏపీలో కీలక మంత్రిత్వ శాఖలు నిర్వహించిన రఘువీరారెడ్డి నాయకత్వం.. సైలెంట్‌గా ఉన్న పాత కాంగ్రెస్ శ్రేణుల్లో నూతన ఉత్సాహాన్ని నింపే అవకాశం ఉంది. ఈ 10 మంది సభ్యుల కమిటీ ప్రాథమిక విధి కేవలం టికెట్ల కేటాయింపు లేదా కార్యాలయ వ్యవహారాలకే పరిమితం కాదు. సీడబ్ల్యూసీ సభ్యుడు గిడుగు రుద్రరాజు, మాజీ కేంద్ర మంత్రులు పల్లంరాజు, కిల్లి కృపారాణి, తులసిరెడ్డి, షేక్ మస్తాన్ వలి వంటి దిగ్గజాలతో కూడిన ఈ బృందం త్వరలోనే జిల్లాల పర్యటనలకు శ్రీకారం చుట్టనుంది. గత కొన్నేళ్లుగా వైసీపీ, టీడీపీల వైపు వెళ్లిన ద్వితీయ శ్రేణి నేతలను, కాంగ్రెస్‌తో అనుబంధం ఉన్న పాత కుటుంబాలను పరామర్శించడం, తీవ్ర అసంతృప్తితో ఉన్న క్షేత్రస్థాయి శ్రేణులను తిరిగి సొంత గూటికి రప్పించడమే ఈ కమిటీ ప్రధాన లక్ష్యంగా కనిపిస్తోంది. రాజకీయ సమీకరణాల పరంగా చూస్తే, ప్రస్తుతం ఏపీలో తీవ్రమైన అధికార-ప్రతిపక్ష పోరు నెలకొంది. ఓవైపు వైఎస్ఆర్‌సీపీ తమ అభ్యర్థులను నిలబెట్టేందుకు కష్టపడుతున్న తరుణంలో, మరోవైపు కూటమి ప్రభుత్వంపై ఉండే సహజ వ్యతిరేకతను లేదా తటస్థ ఓటు బ్యాంకును ఆకర్షించడానికి కాంగ్రెస్‌కు ఇది అనుకూల సమయం. స్థానిక సంస్థల పోరులో పంచాయతీ, మండల, మున్సిపల్ స్థాయిలో బహుముఖ పోటీని సృష్టించడం ద్వారా, రాష్ట్రంలో కనీసం 10 నుండి 15 శాతం ఓటు బ్యాంకును తిరిగి సాధించవచ్చని పార్టీ అంచనా వేస్తోంది. వైఎస్సార్ వారసత్వం కార్డ్‌ను షర్మిల వాడుతుండగా, పాత కాంగ్రెస్ పునాదుల ను రఘువీరా బృందం బలోపేతం చేసే ప్రయత్నం చేస్తోంది. కాంగ్రెస్ బాటలో సవాళ్లు తక్కువగానేమీ లేవు. క్షేత్రస్థాయిలో పార్టీకి ఆర్థికంగా, అంగబలంతో అండగా నిలిచే నాయకత్వం దాదాపు కనుమరుగైంది. ఎన్నికల నిర్వహణ వ్యయం విపరీతంగా పెరిగిన నేపథ్యంలో, గెలుపు గుర్రాలను వెతికి పట్టుకోవడం ఈ కమిటీకి అతిపెద్ద అగ్నిపరీక్ష. అలాగే రఘువీరారెడ్డి సుదీర్ఘ విరామం తర్వాత క్షేత్రస్థాయిలో ఎంతవరకు పర్యటించి, నేతలలో ఆత్మవిశ్వాసాన్ని నింపగలరనేది కూడా కీలకం. ఏది ఏమైనా, సరైన వ్యూహం లేకుండా ఎన్నికలకు వెళ్లే విధానానికి స్వస్తి పలికి, ముందుగానే పక్కా కసరత్తు ప్రారంభించడం కాంగ్రెస్ సాధించిన సానుకూల పరిణామంగానే చెప్పాలి. రఘువీరారెడ్డి నేతృత్వంలోని ఈ హైపవర్ కమిటీ ఏపీ కాంగ్రెస్‌కు ఎంతవరకు సంజీవని గా మారుతుందో వేచి చూడాలి. అధికారంలో ఉన్న కూటమిని, ప్రధాన ప్రతిపక్షమైన వైఎస్ఆర్‌సీపీని తట్టుకుని స్థానిక పోరులో స్థానాలు గెలుచుకుంటేనే 2029 సార్వత్రిక ఎన్నికల నాటికి ఏపీలో కాంగ్రెస్ పునరుజ్జీవనానికి పునాది పడుతుంది.

# జనసేన తీర్థానికి వైఎస్ఆర్‌సీపీ సీనియర్ల దూరమా?




**ఒంగోలు సెప్టెంబర్ 21, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో వైఎస్ఆర్‌సీపీ ప్రాధాన్యం క్రమంగా తగ్గుతున్న క్రమంలో, ఆ పార్టీకి చెందిన పలువురు సీనియర్ నాయకులు గుడ్‌బై చెబుతూ కొత్త దారులు వెతుక్కుంటున్నారు. విజయనగరం జిల్లా జడ్పీ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు వైఎస్ఆర్‌సీపీకి రాజీనామా చేసిన వెంటనే నేరుగా టీడీపీ గూటికి చేరడం చర్చనీయాంశం అయింది. ప్రతిపక్షం నుంచి బయటకు వస్తున్న నేతలకు కూటమి రూపంలో రెండు వేదికలు అందుబాటులో ఉన్నప్పటికీ, మెజారిటీ నాయకులు జనసేన వైపు చూడకుండా కేవలం తెలుగుదేశం వైపే మొగ్గు చూపడానికి ఆసక్తి చూపిస్తున్నారు. ఈ పరిస్థితికి ప్రధాన కారణం జనసేనలో చేరిన తర్వాత లభిస్తుందనుకున్న ప్రాధాన్యత పై రాజకీయ నేతలకు ఉన్న అనుమానాలే. వైఎస్ఆర్‌సీపీ నుంచి బయటకు వచ్చి జనసేన తీర్థం పుచ్చుకున్న మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి ఉదంతం ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణగా నిలుస్తోంది. రాయలసీమ , ప్రకాశం జిల్లా రాజకీయాల్లో సుదీర్ఘ అనుభవం ఉన్న బాలినేని వంటి సీనియర్ నేత జనసేనలో చేరినప్పటికీ, ఆయనకు క్షేత్రస్థాయిలో ఆశించిన స్థాయిలో ప్రాధాన్యత లభించడం లేదనే అభిప్రాయం ఉంది. పైగా ఒంగోలు పరిసర నియోజకవర్గాల్లో కూటమి భాగస్వామి అయిన టీడీపీ స్థానిక నేతలతో బాలినేనికి తరచూ విభేదాలు రావడం, కూటమి శ్రేణుల మధ్య ఘర్షణలు వాతావరణం నెలకొనడం వంటివి ఆయనకు మరింత ఇరకాటంగా మారాయి. జనసేన అధినేత, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పార్టీ విషయంలో అనుసరిస్తున్న కఠినమైన ఫిల్టరింగ్ విధానం కూడా ఈ వలసల వేగాన్ని తగ్గించింది. అధికారంలోకి వచ్చిన తర్వాత పార్టీలోకి వచ్చే వారి విషయంలో పవన్ జాగ్రత్తలు వహిస్తున్నారు. గతంలో జనసేనను, పవన్ కళ్యాణ్‌ను వ్యక్తిగతంగా తీవ్రస్థాయిలో విమర్శించిన వైఎస్ఆర్‌సీపీ నేతలను, ,నియోజకవర్గాల్లో వివాదాస్పద ఇమేజ్ ఉన్న వారిని పార్టీలోకి చేర్చుకోవడానికి ఆయన సుముఖంగా లేరు. దీంతో పార్టీలోకి రావాలని ఆశపడే నేతలకు కనీసం గ్రీన్ సిగ్నల్ కూడా లభించని పరిస్థితి నెలకొంది. అధికారిక ప్రాధాన్యత , నియోజకవర్గాల్లో పట్టు సాధించే క్రమంలో టీడీపీయే సరైన వేదిక అని జంపింగ్ నేతలు భావిస్తున్నారు. పాత వైఎస్ఆర్‌సీపీ నేతలకు నియోజకవర్గ స్థాయి వ్యవస్థలపై, అధికారులపై ప్రభావం చూపగలిగే బలమైన కేడర్ అవసరం. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని టీడీపీకి గ్రామస్థాయి నుంచి నియోజకవర్గ స్థాయి వరకు బలమైన యంత్రాంగం ఉంది. జనసేన ఓటు బ్యాంకు బలమైనదే అయినప్పటికీ, నియోజకవర్గంలో రాజకీయం నడపాలంటే టీడీపీ అధికారిక చత్రం కింద ఉండటమే రక్షణ అని సీనియర్ నాయకులు లెక్కింపులు వేస్తున్నారు. జనసేన అంతర్గత నిర్మాణం, నిర్ణయాల ప్రక్రియ కూడా ఇక్కడ ఒక అంశంగా మారింది. పవన్ కళ్యాణ్ చుట్టూ ఉన్న కోటరీ , పరిమితమైన పార్టీ పదవుల కేటాయింపు వల్ల, కొత్తగా చేరే వైఎస్ఆర్‌సీపీ మాజీ సీనియర్లకు సముచిత స్థానం దక్కుతుందా లేదా అనే సంశయం ఉండిపోయింది. బాలినేని శ్రీనివాసరెడ్డి ఉదంతాన్ని చూసిన తర్వాత చాలామంది వైఎస్ఆర్‌సీపీ సీనియర్లు జనసేనలోకి వెళ్లి మూలన పడేకంటే, నేరుగా టీడీపీలోకి వెళ్లి తమ ఉనికిని చాటుకోవడమే మేలు అనే ముగింపునకు వచ్చినట్లు కనిపిస్తోంది. ఈ పరిణామాలు క్షేత్రస్థాయిలో జనసేన విస్తరణకు కొంత అడ్డంకిగా మారినప్పటికీ, స్వచ్ఛమైన ఇమేజ్ ఉన్నవారినే పార్టీలోకి తీసుకోకూడదనే పవన్ కళ్యాణ్ వ్యూహం సుదీర్ఘకాలంలో పార్టీ సిద్ధాంతానికి మేలు చేస్తుందని జనసేన వర్గాలు వాదిస్తున్నాయి. అయితే, ప్రతిపక్ష వైఎస్ఆర్‌సిపి బలహీనపడుతున్న ఈ కీలక సమయంలో వలసొచ్చే బలమైన నేతలను ఆకర్షించడంలో జనసేన వెనుకబడితే, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ద్వితీయ శ్రేణి నాయకత్వాన్ని నిర్మించుకోవడం ఆ పార్టీకి అతిపెద్ద సవాలుగా మారే అవకాశముంది.

# కల్తీ నెయ్యి... అడ్డంగా దొరికినట్టేనా

**తిరుమల, సెప్టెంబర్ 21, పెన్ పవర్:** తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం కల్తీ నెయ్యి వ్యవహారంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ వెల్లడించిన దర్యాప్తు వివరాలను పట్టుకుని వైఎస్సార్‌సీపీ చేస్తున్న ప్రచారం ఆ పార్టీకే రాజకీయంగా, నైతికంగా తీవ్రమైన సెల్ఫ్ గోల్‌గా మారుతోంది. సుకృతి ఫుడ్స్ ప్రమోటర్ కైలాష్ చంద్ మంగ్లాను అరెస్ట్ చేసిన ఈడీ.. టీటీడీకి సరఫరా చేసిన నెయ్యిలో పామాయిల్, పామ్ కెర్నల్ ఆయిల్, ఎంజీ-90, మైవాసెట్ సాఫ్ట్ 400 వంటి ప్రమాదకర రసాయనాలు కలిపారని స్పష్టం చేసింది. అయితే, ఇందులో జంతు కొవ్వు ప్రస్తావన లేదన్న ఒకే ఒక్క పాయింట్‌ను పట్టుకుని, చూశారా మేం జంతు కొవ్వు వాడలేదు, మాపై తప్పుడు ఆరోపణలు చేశారు అంటూ వైసీపీ నేతలు సంబరాలు చేసుకోవడం, ఊరట పొందుతున్నట్లు ప్రకటనలు విడుదల చేయడం తీవ్ర విస్మయానికి గురిచేస్తోంది. ఈ రకమైన సమర్థన ద్వారా ఐదేళ్ల తమ హయాంలో తిరుమలకు నకిలీ, విష రసాయనాల నెయ్యి సరఫరా జరిగిందన్న దారుణ సత్యాన్ని వైఎస్సార్‌సీపీ పరోక్షంగా నూటికి నూరు శాతం అధికారికంగా అంగీకరించినట్లయింది. ప్రాథమికంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అనేది ఒక ఆర్థిక నేరాల దర్యాప్తు సంస్థ మాత్రమే. ప్రివెన్షన్ ఆఫ్ మనీ లాండరింగ్ యాక్ట్ పరిధిలో అక్రమ నగదు లావాదేవీలు, డొల్ల కంపెనీలు, కల్తీ సరుకు కొనుగోళ్ల ముసుగులో జరిగిన నిధుల మళ్లింపును నిగ్గుతేల్చడమే దాని పని. నెయ్యిలో జంతు కొవ్వు ఉందా, లేదా అనేది తేల్చాల్సింది ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ , ప్రత్యేక ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్‌లు, కోర్టు పరిధిలోని సిట్ దర్యాప్తు మాత్రమే తప్ప, అది ఈడీ పరిధిలోని అంశం కాదు. అలాంటప్పుడు ఈడీ రిపోర్టులో జంతు కొవ్వు పేరు రాలేదని సంబరాలు చేసుకోవడం ప్రజల దృష్టిని మళ్లించే కుట్రే. ఈడీ మోపిన 230 కోట్ల అక్రమ దందా, ఫేక్ రికార్డులు, విషపూరిత కెమికల్స్‌తో కూడిన తయారీ ఆరోపణలను వైసీపీ పూర్తిగా ఒప్పేసుకున్నట్లే అవుతోంది. భారతీయ సంస్కృతిలో, హిందూ ధర్మంలో తిరుమల వేంకటేశ్వర స్వామికి సమర్పించే నైవేద్యం పవిత్రమైనది. దేశవిదేశాల నుంచి కోట్ల మంది భక్తులు పరమ భక్తితో స్వీకరించే లడ్డూ ప్రసాదంలో ఆవు నెయ్యి స్థానంలో రీఫైన్డ్ పామాయిల్, మోనోగ్లిజరైడ్స్ వంటి పారిశ్రామిక రసాయనాలను కలిపి అంటగట్టడం కలియుగ దైవానికి చేసిన క్షమించరాని మహాపచారం కాదా? మేము విష రసాయనాలు మాత్రమే వాడాము తప్ప జంతు కొవ్వు వాడలేదని వాదించడం ఎంతటి దిగజారుడుతనం? కల్తీ జరిగిందని నిర్ధారణ అయినప్పుడు, అది ఏ రూపంలో ఉన్నా భక్తుల మనోభావాలను, దైవ పవిత్రతను తీవ్రంగా దెబ్బతీసిన ఘోర నేరమే అవుతుంది. మనీలాండరింగ్ కోణంలో 230 కోట్ల కుంభకోణం జరిగిందని, అందులో 96 కోట్ల విలువైన కల్తీ రసాయన నెయ్యి ఒక్క కంపెనీ నుంచే సరఫరా అయిందని ఈడీ తేల్చింది. పాల సేకరణే లేని ఫ్యాక్టరీల నుంచి ట్యాంకర్ల కొద్దీ కెమికల్ లిక్విడ్ తిరుమల కొండపైకి చేరుతుంటే అప్పటి పాలకమండలి పెద్దలు ఏం చేస్తున్నారు? ఈ అక్రమ రవాణాలో టీటీడీ అధికారులకు, రాజకీయ పెద్దలకు అందిన ముడుపుల మాటేమిటి? శ్రీవారి భక్తుల మనోభావాలతో చెలగాటమాడి, ఆరోగ్యాన్ని పణంగా పెట్టి వేల కోట్ల ప్రజాధనాన్ని కొల్లగొట్టిన ఈ ముఠాకు చట్టపరంగా పడే సాధారణ శిక్షలు సరిపోవు.

**రూ.230 కోట్ల విలువైన కల్తీ నెయ్యి సరఫరా**

తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం కోసం ఏకంగా రూ.230 కోట్ల విలువైన కల్తీ నెయ్యి సరఫరా జరిగిందని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ప్రకటించిది. ఇది కేవలం వ్యాపారుల స్వార్థం మాత్రమే ఉందంటే సామాన్యులు కూడా నమ్మే పరిస్థితి లేదు. సుకృతి ఫుడ్స్ ప్రమోటర్ కైలాష్ చంద్ మంగ్లా, భోలే బాబా డెయిరీ విపిన్ జైన్ వంటి వ్యాపారులు నెయ్యి స్థానంలో పామాయిల్, కెమికల్స్ కలిపారన్నది సాంకేతిక ఆధారాలతో తేలింది. కానీ, నిత్యం కఠిన నిబంధనలు, ల్యాబ్ టెస్టులు, సెక్యూరిటీ ఉండే తిరుమల వంటి పరమ పవిత్ర పుణ్యక్షేత్రంలోకి ఏళ్ల తరబడి ఎలాంటి అడ్డంకులు లేకుండా ట్యాంకర్ల కొద్దీ విషపూరిత నెయ్యి ప్రవేశించిందంటే.. కచ్చితంగా త్యున్నత రాజకీయ అండదండలు లేకుండా ఇది సాధ్యమయ్యే పనేనా ?ఈ ప్రశ్నకు మరింత బలాన్ని చేకూరుస్తోంది టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి వ్యక్తిగత సహాయకుడు కదూరు చిన్న అప్పన్న వ్యవహారం. నెయ్యి సరఫరా చేసే డెయిరీ కాంట్రాక్టర్ల వద్ద కిలో నెయ్యికి 25 చొప్పున కమీషన్ డిమాండ్ చేశారన్న అభియోగాలతో ఇప్పటికే ప్రత్యేక దర్యాప్తు బృందం అప్పన్నను ఏ-24గా అరెస్ట్ చేసి జైలుకు పంపింది. లంచం ఇవ్వడానికి నిరాకరించిన డెయిరీలను నిబంధనల పేరుతో బెదిరించి బ్లాక్‌లిస్ట్‌లో పెట్టించడం, కమీషన్లు ముట్టజెప్పిన కంపెనీలకు రేట్లు పెంచి కాంట్రాక్టులు కట్టబెట్టడం, హవాలా ద్వారా కోట్లాది రూపాయల ముడుపులు అందుకోవడం వంటి అంశాలపై సిట్ ఆధారాలు సేకరించింది. పూరి గుడిసె నేపథ్యం ఉన్న ఒక సాధారణ పీఏ ఖాతాల్లోకి, బినామీ ఆస్తుల్లోకి కోట్ల రూపాయల నిధులు ఎలా చేరాయన్నది ఈ వ్యవహారంలో అసలు గుట్టును బయటపెడుతోంది.

**చైర్మన్ పీఏ ... చైర్మన్ చెప్పకుండా చేయగలడా?**

అయితే ఇక్కడే అసలైన రాజకీయ, పరిపాలనాపరమైన ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఒక చైర్మన్ పీఏ స్థాయి వ్యక్తి ఇంతటి మెగా కుంభకోణాన్ని సొంత పూచీకత్తుతో నడిపించగలడా? డెయిరీలను బెదిరించడం, టీటీడీ కొనుగోలు విభాగం అధికారులను ఆదేశించడం, టెండర్లలో నిబంధనలు మార్చేలా ఒత్తిడి తేవడం ఆయన ఒక్కడి వల్లే అయ్యే పనేనా? వైవీ సుబ్బారెడ్డి పేరును, ఆయన అధికారాన్ని వాడుకోకుండా బోర్డు పరిధిలోని వ్యవహారాలను ఒక పీఏ శాసించడం అసాధ్యమనేది బహిరంగ రహస్యం. గతంలో కల్తీ గురించి ఫిర్యాదులు, ల్యాబ్ నివేదికలు వచ్చినా బుట్టదాఖలు కావడం వెనుక తిరుమల పాలకమండలి పెద్దల మౌనమే రక్షణ కవచంగా నిలిచిందన్న విమర్శలు బలంగా ఉన్నాయి.ప్రస్తుతం సిట్ అప్పన్నను అదుపులోకి తీసుకుని విచారించగా, ఈడీ మాత్రం కైలాష్ మంగ్లా, విపిన్ జైన్ వంటి తయారీదారులను అరెస్ట్ చేస్తూ పీఎంఎల్ఏ చట్టం కింద మనీ ట్రయల్ ను ఛేదిస్తోంది. కల్తీ నెయ్యి వ్యాపారులు సృష్టించిన నల్లధనం ఎవరెవరి ఖాతాల్లోకి వెళ్లింది, ఎవరికి కమీషన్లుగా ముట్టింది అనే బ్యాంకింగ్, హవాలా లింకులు బయటకు వస్తే.. ఆ దర్యాప్తు ముగింపు అప్పన్న వద్దే ఆగిపోవడం అసాధ్యం. అప్పన్న ద్వారా ఆ ముడుపులు ఎవరి గడప దాటాయి, టీటీడీ అప్పటి ఉన్నతాధికారులు, బోర్డు చైర్మన్ కార్యాలయానికి దీనితో ఉన్న లంకె ఏమిటన్నది తేలక తప్పదు.

## 100 శాతం స్ట్రైక్ రేటుపై గురి

**కాకినాడ, సెప్టెంబర్ 21, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్‌లో త్వరలో జరగబోయే మున్సిపల్, స్థానిక సంస్థల ఎన్నికల సమరానికి జనసేన పార్టీ అత్యంత పకడ్బందీ వ్యూహాన్ని రచిస్తోంది. పొత్తుల రాజకీయంలో సీట్ల సంఖ్య కోసం వెంపర్లాడే సాంప్రదాయ ధోరణికి భిన్నంగా.. పోటీ చేసిన ప్రతిచోటా గెలిచి తీరాలనే దృఢ నిశ్చయంతో అడుగులు వేస్తోంది. విశాఖపట్నంలో జరిగిన పార్టీ ఆత్మీయ సమావేశంలో పీఏసీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ చేసిన వ్యాఖ్యలు జనసేన క్షేత్రస్థాయి వ్యూహాన్ని స్పష్టం చేశాయి. మనం తీసుకునే ప్రతిదీ గెలిచే సీటే తీసుకుందాం. కేడర్ నుంచి ఒత్తిడి ఉంది కదా అని గుడ్డిగా 60, 70 లేదా 120 సీట్లు తీసుకోము అని తేల్చిచెప్పడం ద్వారా.. సీట్ల సంఖ్య కంటే గెలుపు గుర్రాలపైనే పార్టీ పూర్తి దృష్టి పెట్టిందన్న స్పష్టమైన సంకేతాన్ని శ్రేణులకు ఇచ్చారు. సార్వత్రిక ఎన్నికల్లో 21 అసెంబ్లీ, 2 ఎంపీ స్థానాల్లో పోటీ చేసి 100 శాతం స్ట్రైక్ రేట్ సాధించిన రికార్డును స్థానిక సమరంలోనూ పునరావృతం చేయడమే పార్టీ ప్రధాన అజెండాగా కనిపిస్తోంది. గతంలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తీవ్ర నిర్బంధాలు, బెదిరింపులను ఎదుర్కొంటూనే విశాఖ కార్పొరేషన్‌లో 3 వార్డులు గెలవడంతో పాటు 7 చోట్ల రెండో స్థానంలో నిలిచిన చరిత్రను పార్టీ గుర్తుచేసుకుంటోంది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండటం, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పాలనాపరమైన పనితీరు ప్రజల్లో సానుకూలతను పెంచిన వేళ.. క్షేత్రస్థాయిలో పార్టీకి తిరుగులేని పట్టున్న వార్డులు, డివిజన్లను గుర్తించి అక్కడ మాత్రమే పూర్తి బలంతో బరిలోకి దిగాలని అధినాయకత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది. కూటమిలో భాగస్వామిగా ఉంటూ అనవసర డిమాండ్లతో సమన్వయాన్ని దెబ్బతీయకుండా, వాస్తవ బలాబలాల ఆధారంగానే సీట్ల సర్దుబాటు ఉండాలనేది జనసేన లైన్. ఏదో ప్రభావం చూపే స్థానంలో ఉన్నాం కదా అని మిత్రపక్షాలపై ఒత్తిడి తెచ్చి ఎక్కువ సీట్లు తీసుకోవడం.. ఆ తర్వాత సమన్వయం లేక లేదా అభ్యర్థుల బలహీనత వల్ల చేజేతులా ఓడిపోవడం వంటి తప్పులకు జనసేన తావివ్వదలుచుకోలేదు. స్థానిక సమస్యలపై పట్టు, ప్రజల్లో నిరంతరం ఉండే నాయకత్వం, గెలిచే సత్తా ఉన్న అభ్యర్థులు ఉన్న చోట మాత్రమే కూటమి తరఫున జనసేన సీట్లను క్లెయిమ్ చేయాలని నిర్ణయించింది. ఇది అటు కూటమి ఐక్యతను కాపాడటంతో పాటు, ప్రత్యర్థి వైఎస్సార్‌సీపీకి ఏ ఒక్క స్థానంలోనూ పట్టు చిక్కకుండా చేసే వ్యూహాత్మక ఎత్తుగడ. పార్టీ శ్రేణులకు నాయకత్వం ముందస్తు హెచ్చరికలు కూడా జారీ చేసింది. టికెట్ రాగానే గెలిచేసినట్లు భావించే అతివిశ్వాసం వద్దని, సోషల్ మీడియాలో వచ్చే అనవసర ప్రచారాలు, సీట్ల సంఖ్యపై సాగే చర్చలను పట్టించుకోవద్దని తేల్చిచెప్పింది. అధినేత పవన్ కళ్యాణ్ నిర్ణయమే తుది నిర్ణయమని, పార్టీ ఎక్కడ పోటీ చేసినా అక్కడ జనసేన-టీడీపీ-బీజేపీ కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా పనిచేయాలని కేడర్‌కు స్పష్టం చేశారు. సంఖ్యతో కూడిన డాంబికాల కంటే.. పోటీ చేసిన ప్రతి స్థానంలోనూ విజయకేతనం ఎగురవేసి అన్‌బీటెన్ బ్రాండ్‌ను కాపాడుకోవడమే జనసేన అసలైన స్థానిక మంత్రంగా కనిపిస్తోంది.

# పవన్ ఏం చెబుతారో... సర్వత్రా ఉత్కంఠ !



**హైదరాబాద్ పెన్ పవర్:** జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఈ నెల 22న కాకినాడ వేదికగా కీలకమైన పార్టీ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశం స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో జరుగుతోంది. దాంతో స్థానిక ఎన్నికల విషయంలో జనసేన వ్యూహాలు ఏమిటి ఆ పార్టీ పోటీ చేసే సీట్లు ఎన్నికల పొత్తులలో వ్యవహరించే విధానం మీద అంతటా ఆసక్తి అయితే ఉంది. ఎందుకంటే 2024 ఫార్ములాను జనసేన నేతలు ఇప్పటికే కాదు కూడదని చెప్పారని అంటున్నారు. అంతే కాదు 30 శాతం సీట్లు తమకు దక్కాలని కోరుకుంటున్నారు అని కూడా ప్రచారంలో ఉంది. అయితే అదే సమయంలో జనసేన అగ్ర నేత మంత్రి నాదెండ్ల మనోహర్ విశాఖలో జరిగిన పార్టీ సమావేశంలో మాట్లాడుతూ బలం ఉన్న చోటనే జనసేన పోటీ పడాలని సూచించినట్లుగా వార్తలు వచ్చాయి. ఈ నేపథ్యంలో జరుగుతున్న ఈ కీలక సమావేశం మీద అందరి ఫోకస్ ఉందిపుడు.

**తీవ్ర అసంతృప్తితో :**

ఇదిలా ఉంటే నాదెండ్ల మనోహర్ బలం ఉన్న చోట పోటీ పడాలని బాధ్యత కలిగిన పార్టీగా జనసేన వ్యవహరించాలని సూచించినట్లుగా ప్రచారం సాగింది. దీని మీద జనసైనికులు అయితే తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు అని అంటున్నారు. ఎందుకంటే ఈసారి స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయాలని చాలామంది పెద్ద ఎత్తున ఉత్సాహం చూపిస్తున్నారు. ఈ తరహా ప్రకటనలు వారి ఆశల మీద నీళ్ళు చల్లుతున్నాయి. దాంతో ఈ పరిణామాల నేపథ్యంలో జనసేన అధినేత పవన్ వెంటనే ఒక అతి ముఖ్య సమావేశం ఏర్పాటు చేయడంతో పవన్ ఏమి చెబుతారు అన్నది అయితే చర్చకు వస్తోంది.

**పవన్ డెసిషన్ అంటే :**

ఇక చూస్తే పవన్ కళ్యాణ్ జనసేన పార్టీ అధినేత హోదాలో ఏది చెప్పినా అదే ఫైనల్ అని అంటున్నారు. ఈసారి ఎక్కువ సీట్లు తీసుకుని కూటమితో కలసి పోటీ చేస్తామని పవన్ కనుక ప్రకటిస్తే ఆ లెక్క వేరే ఉంటుందని అంటున్నారు. ఎందుకంటే దశాబ్దం పైగా జనసేన నాయకులు కానీ క్యాడర్ కానీ పార్టీ కోసం ఎంతగానో శ్రమించారు అని ఇప్పుడు వారికి గ్రౌండ్ లెవెల్ లో అధికారం అందుకునే చాన్స్ వచ్చిందని అంటున్నారు. అదే విధంగా పార్టీలో క్షేత్ర స్థాయిలో ఆశలు ఆకాంక్షలకు పవన్ నిర్ణయాలు ప్రతిబింబిస్తాయని కూడా అనేక మంది భావిస్తున్నారు. అయితే జనసేన కూటమిలో అతి ముఖ్య భాగస్వామి. కాబట్టి ఆచీ తూచీ నిర్ణయాలు తీసుకునే అవకాశాలు ఉంటాయని అంటున్నారు. దాంతో బాలెన్స్ గానే జనసేన విధానాలు కానీ ఆలోచనలు కానీ ఉంటాయని చెబుతున్నారు. అలా కనుక చూస్తే ఏ రకమైన తీర్మానం వెలువడుతుంది అన్నది కూడా ఉత్కంఠను రేపేదిగా ఉంటుందని అంటున్నారు.

**కందులకు బాధ్యతలు :**

మరో వైపు చూస్తే జనసేన పార్టీకి సంబంధించి స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రచార సారథ్యాన్ని కో ఆర్డినేట్ చేసుకునే కీలక భూమికను మంత్రి కందుల దుర్గేష్ కి పవన్ అప్పగించారు. దీంతో ఆయన మీద మరింత కొత్త భారాలు పెరిగాయని అంటున్నారు. సౌమ్యుడిగా ఉంటూ అందరికీ కలుపుకుని పోయే కందులకు జనసేన ప్రచార కమిటీ కో ఆర్డినేటర్ గాబాధ్యతలు అప్పగించడం పట్ల పార్టీలో హర్షం వ్యక్తం అవుతోంది అని అంటున్నారు. అలాగే జనసేన శ్రేణులను ఏకమొత్తంగా ముందుకు నడిపించే సామర్థ్యం ఆయనకు ఉందని అంటున్నారు. మొత్తం మీద చూస్తే చాలా కాలం తరువాత స్థానిక సంస్థల ఎన్నికల ముంగిట పవన్ కాకినాడలో తన పార్టీ శ్రేణులతో నిర్వహించే కీలక సమావేశం మీద జనసేన మాత్రమే కాదు ఏపీ రాజకీయ మొత్తం నిశితంగా చూస్తోంది అని అంటున్నారు.

## గోల్డ్ మెడల్ పోరులో భారత్ vs శ్రీలంక: ఆసియా గేమ్స్ ఫైనల్ మ్యాచ్ ఎప్పుడు, ఎక్కడ చూడాలంటే!





**హైదరాబాద్ పెన్ పవర్:** ఆసియా గేమ్స్ 2026 మహిళల క్రికెట్ విభాగంలో అత్యంత కీలక ఘట్టం ఆసన్నమైంది. పసిడి పతకం కోసం డిఫెండింగ్ ఛాంపియన్ భారత మహిళల క్రికెట్ జట్టు శ్రీలంక మహిళల జట్టు (మంగళవారం, సెప్టెంబర్ 22) హోరాహోరీగా తలపడనున్నాయి. జపాన్‌లోని నిషిన్‌లో ఉన్న కోరోగీ స్పోర్ట్స్ పార్క్ వేదికగా ఈ చారిత్రాత్మక ఫైనల్ పోరు జరగనుంది.

**అద్భుత ప్రదర్శనతో ఫైనల్‌కు భారత్, లంక:**

భారత్ ఘన విజయం: బంగ్లాదేశ్‌తో జరిగిన సెమీఫైనల్‌లో ఓపెనర్ షెఫాలీ వర్మ కేవలం 49 బంతుల్లోనే అజేయంగా 100 పరుగులు చేసి రికార్డు సెంచరీతో విరుచుకుపడింది. దీంతో భారత్ 20 ఓవర్లలో 195/4 పరుగులు చేయగా.. బంగ్లాదేశ్‌ను 81 పరుగులకే ఆలౌట్ చేసి 114 పరుగుల భారీ తేడాతో విజయం సాధించింది. ఇదే మ్యాచ్‌లో స్మృతి మంధాన మహిళల టీ20ల్లో అత్యధిక పరుగులు చేసిన ప్లేయర్‌గా ప్రపంచ రికార్డు సృష్టించింది.

శ్రీలంక ఊచకోత: పాకిస్థాన్‌తో జరిగిన మరో సెమీఫైనల్‌లో శ్రీలంక కెప్టెన్ చమరి అతపత్తు (50 బంతుల్లో 83 నాటౌట్) చెలరేగడంతో 178 పరుగుల భారీ లక్ష్యాన్ని కేవలం 2 వికెట్లు కోల్పోయి ఛేజ్ చేసింది.

**మరోసారి ఆసియా కప్ రిపీట్:**

ఈనెల ఆరంభంలో దుబాయ్‌లో జరిగిన మహిళల ఆసియా కప్ 2026 ఫైనల్‌లోనూ భారత్ వర్సెస్ శ్రీలంక జట్లే పోటీపడ్డాయి. ఆ మ్యాచ్‌లో భారత్ ఘన విజయం సాధించి ట్రోఫీ గెలుచుకుంది. ఇప్పుడు ఆసియా గేమ్స్ ఫైనల్లోనూ ఈ రెండు జట్లు తలపడతుండటం విశేషం. 2022 హ్యాంగ్‌జౌ ఆసియా గేమ్స్‌లో స్వర్ణం గెలుచుకున్న టీమిండియా, ఈసారి కూడా టైటిల్‌ను నిలబెట్టుకోవాలని పట్టుదలతో ఉంది. శ్రీలంక జట్టు ఆసియా గేమ్స్‌లో తమ తొలి క్రికెట్ గోల్డ్ మెడల్ సాధించాలని భావిస్తోంది.

**హెడ్ టు హెడ్ రికార్డు:**

మొత్తం మ్యాచ్‌లు: 32

భారత్ విజయం: 26

శ్రీలంక విజయం: 5

ఫలితం లేనిది: 1

**కీలక ఆటగాళ్లు:**

భారత జట్టు తరఫున ఫామ్‌లో ఉన్న షెఫాలీ వర్మ, స్మృతి మంధాన, కెప్టెన్ హర్మాన్‌ప్రీత్ కౌర్, ఆల్ రౌండర్ దీప్తి శర్మ మ్యాచ్ విన్నర్లుగా మారనుండగా.. శ్రీలంక జట్టు పూర్తిగా వారి స్టార్ కెప్టెన్ చమరి అతపత్తుపై ఆధారపడి ఉంది.

**మహిళల ఆసియా గేమ్స్ 2026 ఫైనల్ వివరాలు:**

తేదీ: సెప్టెంబర్ 22, 2026 (మంగళవారం)

సమయం: ఉదయం 10:30 గంటలకు (IST) (జపాన్ కాలమానం ప్రకారం మధ్యాహ్నం 2:00 గంటలకు)


వేదిక: కోరోగీ స్పోర్ట్స్ పార్క్, నిషిన్, జపాన్

టీవీ ప్రసారం: భారత్‌లో Sony Sports Network ఛానెళ్లలో ప్రత్యక్ష ప్రసారం కానుంది.

లైవ్ స్ట్రీమింగ్: SonyLIV యాప్, వెబ్‌సైట్‌లో లైవ్ చూడవచ్చు.

# CSKలో సంచలన మార్పు.. జహీర్ ఖాన్‌కు హెడ్ కోచ్ బాధ్యతలు!




**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్ 2027 సీజన్‌కు ముందు ఐదుసార్లు ఛాంపియన్ చెన్నై సూపర్ కింగ్స్ సంచలన నిర్ణయం తీసుకుంది. తమ కొత్త హెడ్ కోచ్‌గా భారత మాజీ దిగ్గజ పేసర్ జహీర్ ఖాన్ ను నియమించింది. గత 18 ఏళ్లుగా సీఎస్కేతో సుదీర్ఘ అనుబంధం ఉన్న స్టీఫెన్ ఫ్లెమింగ్ ఆ పదవి నుంచి తప్పుకోవడంతో జహీర్ ఖాన్‌కు ఈ బాధ్యతలు అప్పగించారు.

**లెఫ్ట్ ఆర్మ్ టేకింగ్ ఓవర్.. సీఎస్కే గ్రాండ్ వెల్కమ్:**

ఇంగ్లాండ్ కోచ్‌గా ఫ్లెమింగ్: 18 ఏళ్ల పాటు సీఎస్కే కోచింగ్ సెటప్‌లో కీలక పాత్ర పోషించి ఎన్నో ట్రోఫీలను అందించిన స్టీఫెన్ ఫ్లెమింగ్, జులైలో ఇంగ్లాండ్ పురుషుల టెస్టు జట్టు హెడ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో సీఎస్కేతో తన బంధాన్ని ముగించడంతో ఫ్రాంచైజీ జహీర్‌ను ఎంచుకుంది. 2017లో ఐపీఎల్ నుంచి ఆటగాడిగా రిటైర్ అయిన తర్వాత జహీర్ ఖాన్ వివిధ ఫ్రాంచైజీలలో కీలక బాధ్యతలు నిర్వర్తించాడు.

**మెంటార్‌గా జహీర్ అనుభవం:**

ముంబై ఇండియన్స్ : ముంబై ఇండియన్స్‌కు డైరెక్టర్ ఆఫ్ క్రికెట్ ఆపరేషన్స్ గా, ఆ తర్వాత హెడ్ ఆఫ్ గ్లోబల్ డెవలప్‌మెంట్‌గా సేవలందించాడు.

లక్నో సూపర్ జెయింట్స్ : ఐపీఎల్ 2025 సీజన్‌లో లక్నో సూపర్ జెయింట్స్ మెంటార్‌గా వ్యవహరించాడు.

ఐపీఎల్ కెరీర్: ఐపీఎల్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (RCB), ముంబై ఇండియన్స్, ఢిల్లీ క్యాపిటల్స్ తరఫున 100 మ్యాచ్‌లు ఆడిన జహీర్ 27.27 సగటుతో 102 వికెట్లు పడగొట్టాడు.

అంతర్జాతీయ రికార్డు: టీమిండియా తరఫున మూడు ఫార్మాట్లలో కలిపి ఏకంగా 610 అంతర్జాతీయ వికెట్లు సాధించాడు.

ఐదుసార్లు ఐపీఎల్ ట్రోఫీని గెలుచుకున్న చెన్నై సూపర్ కింగ్స్, 2027 సీజన్ కోసం జహీర్ ఖాన్ మార్గదర్శకత్వంలో ఒక కొత్త శకానికి శ్రీకారం చుట్టింది. జహీర్ సుదీర్ఘ క్రికెటింగ్ విజన్ సీఎస్కే యువ బౌలర్లకు, జట్టు విజయాలకు ఎంతగానో ఉపయోగపడుతుందని అభిమానులు ఆశిస్తున్నారు.

## 700 గ్రాముల బరువుతో ఫైనల్ ఛాన్స్ మిస్: రింగ్‌లోనే ఏడ్చేసిన సుచిక.. కాంస్యంతో సరి!

**హైదరాబాద్ పెన్ పవర్:** ఆసియా గేమ్స్ 2026 లో భారత మిక్స్డ మార్షల్ ఆర్ట్స్ ఫైటర్ సుచిక తరియాల్ ( చారిత్రాత్మక విజయం సాధించినప్పటికీ, తీవ్ర గుండెకోతకు గురైంది. మహిళల ట్రెడిషనల్ 60 కేజీల సెమీఫైనల్‌లో అద్భుత ప్రదర్శన చేసినా, విచిత్రమైన వెయిట్ రూల్ కారణంగా ఆమె రజతం/పసిడి పోరుకు దూరమై కాంస్య పతకంతోనే సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఈ ఫలితంతో తీవ్ర నిరాశ చెందిన సుచిక మ్యాచ్ ముగియగానే మ్యాట్‌పైనే ఒక్కసారిగా ఏడ్చేసింది.

**1000 డాలర్లు చెల్లించి ఛాలెంజ్ చేసినా:**

సింగపూర్‌కు చెందిన హ్యూ హూన్ టియో తో జరిగిన ఈ సెమీఫైనల్ పోరు అత్యంత ఉత్కంఠభరితంగా కొనసాగింది.

రెగ్యులర్ రౌండ్లు టై: ఇద్దరు ఫైటర్లు చెరో రౌండ్‌లో ఆధిపత్యం చెలాయించడంతో ఓవర్ టైమ్‌కు మ్యాచ్ వెళ్లింది. ఓవర్ టైమ్ తర్వాత కూడా విజేత ఎవరో స్పష్టంగా తేలకపోవడంతో తొలిగా టియోను విజేతగా ప్రకటించారు.

భారత్ రివ్యూ ఛాలెంజ్: రెఫరీ నిర్ణయాన్ని నిరసిస్తూ భారత మేనేజ్‌మెంట్ వి1,000 డాలర్లు (సుమారు ?84,000) ఆర్బిట్రేషన్ ఫీజు చెల్లించి సవాలు చేసింది. ఆరుగురు న్యాయనిర్ణేతలు రీ-రివ్యూ చేసి మ్యాచ్‌ను డ్రా (Draw)గా ప్రకటించారు.

**విజేతను తేల్చిన 700 గ్రాముల బరువు:**

ఇంటర్నేషనల్ మిక్స్డ మార్షల్ ఆర్ట్స్ ఫెడరేషన్ నిబంధనల ప్రకారం మ్యాచ్ రీ-రివ్యూ తర్వాత కూడా టై అయితే ఉదయం జరిగిన వెయిట్-ఇన్ ఆధారంగా తక్కువ బరువు ఉన్న ఫైటర్‌ను విజేతగా ప్రకటిస్తారు.

తక్కువ బరువుతో టియోకు లబ్ధి: సుచిక ఉదయం 59.2 కేజీల బరువు ఉండగా, సింగపూర్ ప్లేయర్ టియో 58.5 కేజీల బరువు ఉంది.

700 గ్రాముల తేడాతో: కేవలం 700 గ్రాములు తక్కువ బరువు ఉన్నందున టియోను విజేతగా ప్రకటించి ఫైనల్‌కు పంపారు. దీంతో సుచిక కాంస్య పతకానికి పరిమితమైంది.

**ఇది అన్యాయం.. కానీ దేశం కోసం గర్వపడుతున్నా:**

తీర్పు వినగానే తీవ్ర భావోద్వేగానికి గురైన సుచిక, నేను ఈ మ్యాచ్ గెలిచానని భావించాను.. ఫలితాన్ని అంగీకరించలేకపోతున్నాను, ఇది నాకు అన్యాయంగా అనిపించింది. కానీ దేశం కోసం కాంస్యం సాధించినందుకు సంతోషంగా ఉందని ఆవేదన వ్యక్తం చేసింది. హర్యానాలోని రోహ్‌తక్ జిల్లా కిలోయ్ గ్రామానికి చెందిన సుచిక, చిన్నతనంలో రోడ్డుపై వేధింపులను ఎదుర్కొని స్వీయ రక్షణ కోసం కాంబ్యాట్ స్పోర్ట్స్‌లోకి వచ్చి నేడు ఆసియా గేమ్స్ పీఠం ఎక్కింది.

**చరిత్ర సృష్టించిన సుచిక:**

ఓటమి బాధ పక్కనబెడితే, ఆసియా గేమ్స్ చరిత్రలో మిక్స్డ మార్షల్ ఆర్ట్స్ (వీహీూ) విభాగంలో భారత్‌కు తొలి పతకం అందించిన అథ్లెట్‌గా సుచిక తరియాల్ చరిత్ర పుటలకెక్కింది. సుచిక సాధించిన ఈ కాంస్యంతో ఆసియా గేమ్స్ 2026లో భారత పతకాల సంఖ్య 6కు (4 వెండి, 2 కాంస్యం) చేరింది.

# దసరాకు వస్తే హిట్టే.. మరి ఈసారి?

టాలీవుడ్ లో కొంతమంది హీరోలకు కొన్ని సీజన్లతో స్పెషల్ రిలేషన్ ఉంటుంది. సీనియర్ హీరో విక్టరీ వెంకటేష్ కు సంక్రాంతి అలాంటి సీజన్ అయితే.. దసరా కూడా కలిసొచ్చిన సందర్భాలు ఉన్నాయి. దాదాపు 40 ఏళ్ల సినీ జర్నీలో ఆయన దసరా సమయంలో చాలా తక్కువ సినిమాలతోనే ప్రేక్షకుల ముందుకు వచ్చారు. కానీ వచ్చిన ప్రతిసారీ బాక్సాఫీస్ దగ్గర తన మార్క్ చూపించారు. ఇప్పుడు మరోసారి దసరా సీజన్ లో వెంకీ సినిమా రాబోతుండటంతో ఆ సెంటిమెంట్ పై చర్చ మొదలైంది.వెంకటేష్ ఇప్పటివరకు దసరా సీజన్ ను టార్గెట్ చేస్తూ నాలుగు సినిమాలతో ప్రేక్షకుల ముందుకు వచ్చినట్లు తెలుస్తోంది. వాటిలో ఎక్కువ సినిమాలు మంచి విజయాలను అందుకున్నాయి. దీంతో దసరా సీజన్ కూడా వెంకీకి కలిసొచ్చే టైమ్ గా మారింది. 2000లో వచ్చిన జయం మనదేరా అందుకు బెస్ట్ ఎగ్జాంపుల్. అక్టోబర్ లో దసరా కానుకగా ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఆ సినిమా భారీ విజయాన్ని అందుకుంది.వెంకటేష్ కెరీర్ లో గుర్తుండిపోయే చిత్రాల్లో ఒకటిగా నిలిచింది. యాక్షన్, ఎమోషన్ తో సాగిన ఆ సినిమా అప్పట్లో ప్రేక్షకులను థియేటర్లకు బాగానే రప్పించింది. ఆ తర్వాత 2007లో తులసితో మరోసారి దసరా బరిలోకి దిగారు వెంకటేష్. బోయపాటి శ్రీను





దర్శకత్వంలో తెరకెక్కిన ఆ సినిమా యాక్షన్ తో పాటు కుటుంబ ప్రేక్షకులకు నచ్చే అంశాలతో వచ్చింది. దసరా సెలవులను క్యాష్ చేసుకున్న ఆ చిత్రం మంచి విజయాన్ని అందుకుంది. 2008లో చింతకాయల రవితో మరోసారి ఇదే సీజన్ లో సందడి చేశారు.ఆ సినిమా గత రెండు చిత్రాల రేంజ్ లో విజయం సాధించకపోయినా.. ప్రేక్షకులను అలరించింది. ముఖ్యంగా కుటుంబ ప్రేక్షకులకు కనెక్ట్ అయింది. ఇలా దసరా సీజన్‌లో వెంకటేష్ కు వచ్చిన సినిమాలను చూస్తే.. ఎక్కువ సందర్భాల్లో మంచి రిజల్ట్సే కనిపిస్తాయి. అందుకే ఇప్పుడు రాబోతున్న కొత్త సినిమాపై కూడా ఆ సెంటిమెంట్ చర్చగా మారింది. త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో వెంకటేష్ నటిస్తున్న ఆదర్శ కుటుంబం ఈసారి దసరా బరిలోకి దిగేందుకు సిద్ధమవుతోంది. కుటుంబ కథతో పాటు యాక్షన్, కామెడీ ఎలిమెంట్స్ తో తెరకెక్కుతోంది.ముందు అక్టోబర్ 2న విడుదల చేయాలనే ఆలోచన ఉండగా.. దసరా సెలవులను యూజ్ చేసుకునేలా పండుగ వారంలో విడుదల చేయాలనే ఆలోచనలో మేకర్స్ ఉన్నట్లు సమాచారం. ఇప్పటికే వచ్చిన టీజర్ సినిమాపై హైప్ పెంచింది. త్రివిక్రమ్ డైలాగ్స్, వెంకటేష్ యాక్టింగ్ కలిస్తే ఎలా ఉంటుందనే ఆసక్తి అభిమానుల్లో కనిపిస్తోంది. పైగా దసరా సీజన్ వెంకీకి గతంలో మంచి రిజల్ట్స్ ఇచ్చిన సందర్భాలు ఉండటంతో అంచనాలు మరింత పెరుగుతున్నాయి.అయితే గత రికార్డులు కొత్త సినిమాకు విజయాన్ని ఫిక్స్ చేయవని చెప్పాలి. ఈసారి కథ, కామెడీ, వెంకటేష్ యాక్టింగ్, త్రివిక్రమ్ టేకింగ్ తో పాటు దసరా సెలవులను సినిమా ఎంతవరకు యూజ్ చేసుకుంటుందనేదే మెయిన్. గతంలో దసరా సెంటిమెంట్ ను సక్సెస్ గా మార్చుకున్న వెంకీ.. ఈసారి ఆదర్శ కుటుంబంతో ఆ జోష్ ను కంటిన్యూ చేస్తారా అనేది వేచి చూడాలి.



Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. and published at Dno 6-5-25, medara bazar, 16 th ward, near Old bus stand, Bapatla editor GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/25/A2233, editorpenpower@gmail.com